తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త





## ప్రసన్న వెంకటేశ్వరునికి ఊంజల్‌సేవ



వడమాలపేట, నవంబరు 29 ప్రభాతవార్త: అప్పలాయగుంట ప్రసన్న వెంకటేశ్వరస్వామికి శనివారం ఊంజల్‌సేవ, గ్రామోత్సవం వైభవంగా జరిగింది. వేకువ జామున సుప్రభాతసేవలో స్వామివారిని మేల్కొలిపిన అర్చకులు నిత్యకైంకర్యాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం ఉభయదేవేరులతో పాటు స్వామివారి ఉత్సవ మూర్తులను ఊయాలలో కొలువుదీర్చిగా స్వామివారు గంట పాటు చిద్విలాసంగా ఊయలలూగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం తిరుచ్చి వాహనాన్ని అధిరోహించిన స్వామివారు మాడవీధుల్లో విహరించగా భక్తులు ధూపదీప నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అధికారి వేణుగోపాల్, జూనియర్ అసిస్టెంట్ బాలాజీ, షరాబ్ రవీంద్ర, అర్చకులు, టీటీడీ సిబ్బంది పాల్గొన్నారు.

## ననియాల క్యాంప్‌కు కుంకీ ఏనుగుల తరలింపు



రామకుప్పం, నవంబర్ 29 ప్రభాతవార్త మండలంలోని ననియాల క్యాంప్‌కు శిక్షణ పొందిన కుంకీ ఏనుగులు జయంత్, వినాయక్‌లను అటవీ అధికారులు కుప్పం నుంచి తరలించారు. ఇటీవలే ఈ ఏనుగులను ముసలిమడుగు ఎలిఫెంట్ క్యాంప్‌నుంచి కుప ్పంలోని నడిమూరు క్యాంప్ వద్దకు చేర్చారు. ప్రస్తుతం ఈ ఏనుగులను వాటి స్థావరమైన ననియాల ఎలిఫెంట్ క్యాంప్‌కు తరలించారు. అవసరం ఉన్నపుడు మదపుటేనుగుల కట్టడికి ఈ కుంకీల సాయం తీసుకుంటామని అటవీ అధికారులు

# కల్తీనెయ్యిలో ...మూడో ఛార్జిషీట్ !

### కరీముల్లాకోసం సిట్ వేట -మరికొందరు అరెస్ట్‌ల దిశగా చర్యలు



ప్రభాతవార్త-తిరుపతి: గత ఐదేళ్ళలో సంచలనం రేకెత్తించిన తిరుమల కల్తీనెయ్యికేసులో సిబిఐ సిట్ అధికారులు డిసెంబర్ 15లోపు మూడో ఛార్జిషీట్ దాఖలు చేయనున్న సమయానికి మరికొంతమంది అరెస్ట్ అయ్యే అవకాశం ఉందనేది గుప్పుమంటోంది. ఈ నేపథ్యంలో తాజాగా నెల్లూరు ఏసిబి కోర్టులో సిట్ అధికారులు దాఖలుచేసిన మెమోతో మరో ఏడుమంది టిటిడి అధికారులపై కల్తీనెయ్యి కేసు పాపం నమోదైంది. ఈ కేసులో కీలకమైన ఇప్పటికీ పరారీలో ఉన్న వినయ్‌చావ్డా ప్రతినిధి కరీముల్లకోసం సిట్ వేట మొదలు పెట్టింది. వారంరోజుల్లోపు అతని కదలికలు గమనించి అదుపులోకి తీసుకునేందుకు ముమ్మరంగా దర్యాప్తు చేపడుతోంది. కల్తీనెయ్యి బాగోతంలో ఇప్పటికే టిటిడి నుండి జిఎం సుబ్రమణ్యంను సిట్ అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించింది. ఆయన రిమాండ్ రిపోర్టు ఆధారంగా శనివారం మరో ఏడుమంది టిటిడి అధికారులపై కేసు నమోదైంది. టిటిడి మార్కెటింగ్ విభాగం జూనియర్ అసిస్టెంట్ ఈశ్వర్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ వెంకట అనిల్‌కుమార్, మాజీ డిప్యూటీ ఈఓ వెంకట్‌నటేశ్‌బాబు, మాజీ జిఎంలు, ఎస్‌ఈ, ఈఈలు ,గోశాల మాజీడైరెక్టర్ డాక్టర్ హరినాధరెడ్డి(ఇప్పటికే సస్పెన్షన్‌లో ఉన్న)లపై 274,275,316(5),318(4),61(2), 299 రెడ్‌విత్ 3(5)బిఎన్‌ఎస్ 51,59 సెక్షన్‌ల క్రింద కేసు నమోదు చేశారు. రానున్న వారం రోజుల్లో కొందరిని అరెస్ట్ చేసేందుకు కూడా రంగం సిద్దంచేసుకుంటున్నట్లు తెలుస్తోంది. చివరగా కల్తీనెయ్యిలో ప్రధాన సూత్రధారులైన ముగ్గురు కీలక ప్రముఖుల అరెస్ట్‌లు కూడా తప్పదనేది వినిపిస్తున్న బలమైన వ్యాఖ్యలు. ఈ కేసులో డిసెంబర్ 15కి క్లైమాక్స్‌కు తీసుకురావాలని భావిస్తున్న సిట్ మరింత వేగం పెంచింది.

# దూసుకు వస్తున్న 'దిత్వా' తుఫాను

### జిల్లా వ్యాప్తంగా నేడు, రేపు భారీ నుండి అతిభారీ వర్షాలు - ప్రాణ, ఆస్తి నష్టం జరుగకుండా ముందస్తు చర్యలు

### - కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు: కలెక్టర్ సుమిత్‌కుమార్



చిత్తూరు, నవంబర్ 29 ప్రభాతవార్త: దిత్వా తుఫాను జిల్లాను వణికిస్తోంది. బంగాళాఖాతంలో ఏర్పడిన ఈ దిత్వా తుఫాను ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా ఆది, సోమవారాల్లో భారీ నుండి అతిభారీ వర్షాలతో పాటు భారీ గాలులు వీచే అవకాశం వుండటంతో జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తం అయ్యింది. రిత్వా తుఫాను నేపథ్యంలో జిల్లా అధికారులు అప్రమత్తంగా వుండాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశాలు జారీ చేశారు. ఆది, సోమవారాలు క్షేత్ర స్థాయిలో అధికారులు అందుబాటులో వుండి వర్షాలతో ప్రజలకు ఎలాంటి ఇబ్బందు తలెత్తకుండా పక్కాగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. వాతావరణ శాఖ ఇప్పటికే ఆది, సోమవారాల్లో భారీ వర్షాలు నమోదు అవుతాయని హెచ్చరించిందని, తుఫాను ప్రభావంతో ఎక్కడా ఆస్తి, ప్రాణ నష్టం జరుగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. తీర ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాల్లో నివసించే ప్రజలు అవసరమైతే సురక్షితమైన ప్రాంతాలకు తరలించే ఏర్పాట్లను సిద్ధంగా వుంచాలని సంబంధిత శాఖల అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అలాగే అవసరమైతే తాత్కాలిక పునరావాస శిబిరాలు ఏర్పాటు చేసి తాగునీరు, ఆహారం, వైద్య సౌకర్యం అందుబాటులో వుంచేలా ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. గ్రామాల్లో పోలీసులు, రెవెన్యూ అధికారులు, సిబ్బంది కలిసి విస్తృతంగా ప్రచారం కల్పించాలని, జలపాతాలు, వాగులు, కాలువలు, ప్రమాదకర పర్యాటక ప్రదేశాలను తాత్కాలికంగా మూసివేయాలని కలెక్టర్ ఆదేశించారు. అలాగే ట్రాన్స్‌కో అధికారులు విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, వైర్లు, జనరేటర్లను ముందుగానే సిద్ధం చేసి వుంచుకోవాలని, విద్యుత్ అంతరాయం ఏర్పడితే సత్వరం పునరుద్ధరించడానికి ప్రత్యేక బృందాలు పని చేయాలన్నారు. అలాగే వ్యవసాయ, పశుసంవర్ధక, పంచాయతీరాజ్, మున్సిపల్ శాఖలతో పాటు ఇతర శాఖలు 24/7 అప్రమత్తంగా వుండాలని ఆదేశించారు. అలాగే వైద్య శాఖలో అత్యవసర వైద్య సిబ్బంది, అంబులెన్స్‌లు పూర్తి స్థాయిలో సిద్ధంగా వుంచాలని, పశువులకు సైతం తగిన వైద్య సాయం అందుబాటులో వుండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే లోతట్టు ప్రాంతాల్లో వరద పరిస్థితులు తలెత్తే అవకాశంను దృష్టిలో వుంచుకుని ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని సంబంధిత శాఖల అధికారులకు కలెక్టర్ సూచించారు. ఎక్కడైనా ఏదైనా అత్యవసర పరిస్థితులు నెలకొంటే సత్వరం జిల్లా కంట్రోల్ రూమ్‌కు ప్రజలు సమాచారం అందించాలన్నారు.

# ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను త్వరితగతిన పరిష్కరించాలి

### జిల్లా కలెక్టర్, కమిటీ ఛైర్‌పర్సన్ డా. ఎస్. వెంకటేశ్వర్



తిరుపతి కలెక్టరేట్, నవంబర్ 29 ప్రభాతవార్త: జిల్లాలో ఎస్సీ, ఎస్టీల కు సంబంధించిన సమస్యల పట్ల స్వయంగా తనిఖీ చేసి తక్షణమే పరిష్కారం చూపుతూ నిరంతర పర్యవేక్షణ ఉండాలని జిల్లా కలెక్టర్ , జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ ఛైర్‌పర్సన్ డా. ఎస్. వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. శనివారం స్థానిక కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నందు జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్ గారి అధ్యక్షతన జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశానికి చిత్తూరు పార్లమెంటు సభ్యులు కమిటీ ఛైర్మన్ దగ్గుమళ్ల ప్రసాద్ రావు, ఎస్పీ సుబ్బరాయుడు, డిఆర్ఓ నరసింహులు, సత్యవేడు మరియు సూళ్లూరుపేట ఎమ్మెల్యేలు ఆదిమూలం, నెలవల విజయశ్రీ, ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ చక్రవర్తిలతో కలిసి సమావేశం జరిగింది. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, గత సమీక్షా సమావేశంలో తీసుకున్న నిర్ణయాలపై ఆయా శాఖల సమాధానాలను పరిశీలించిన అనంతరం, జాప్యం జరిగిన అంశాలపై తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న అట్రాసిటీ కేసులు త్వరితంగా పరిష్కారమయ్యేలా కృషి చేయాలని కోరారు. డీవీఎంసీలో ప్రస్తావించే ప్రతి అంశానికి అధికారులు పరిష్కారం చూపాల్సిన బాధ్యత ఉందని, సివిల్ రైట్స్ డే ప్రతి నెలా జరిపి ఎస్సీ/ఎస్టీ సమస్యలకు పరిష్కారం చూపాలను చెప్పారు. సమావేశం అనంతరం జిల్లా కలెక్టర్ కమిటీ సభ్యుల దగ్గర నుంచి అర్జీలను స్వీకరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రవి మనోహరాచారి, డీఎస్పీలు, తిరుపతి, శ్రీకాళహస్తి, సూళ్లూరుపేట ఆర్డీఓలు రామ్మోహన్ , భాను ప్రకాష్ రెడ్డి, కిరణ్మయి, జిల్లా సాంఘిక సంక్షేమ మరియు సాధికార అధికారి విక్రమ్ కుమార్ రెడ్డి, డ్వామా పిడి శ్రీనివాస ప్రసాద్, డీవీఎంసి సభ్యులు, జిల్లా అధికారులు, సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మొరాయించిన ఇండిగో విమానం...




రేణిగుంట నవంబర్ 29 ప్రభాతవార్త.. .రేణిగుంట విమానాశ్రయం నుండి మధ్యాహ్నం 11 45 నిమిషాలకు హైదరాబాద్ వెళ్లవలసిన ఇండిగో విమానం శనివారం సాంకేతిక లోపం వల్ల మొరాయించడంతో టేక్ ఆఫ్ కాలేదు. హైదరాబాద్ నుండి మధ్యాహ్నం ఇండిగో విమానం రేణిగుంటకు చేరుకుంది. తిరిగి 179 మంది ప్రయాణికులను ఎక్కించు కొని టేక్ ఆఫ్ అవుతున్న సమయంలో సాంకేతిక లోపం ఏర్పడడంతో రన్వేపై దాదాపు గంటలపాటు ఉండిపోయింది. సాంకేతిక లోపాన్ని గుర్తించిన పైలట్ చాకచక్యంగా వ్యవహరించి విమానాన్ని టేక్ ఆఫ్ చేయలేదు. దీంతో ప్రయాణికులు తీవ్ర అసహనానికి గురయ్యారు. మరోసారి రన్వపై ప్రయాణించి వెనుకకు వచ్చినట్లు సమాచారం. అయితే ఈ విషయాన్ని విమానాశ్రయ అధికారులు ధ్రువీకరించలేదు. రాత్రి వరకు విమానం ఎయిర్పోర్ట్ లోనే ఉంది. విమానంలో వెళ్లాల్సిన ప్రయాణికులను ఇండిగో విమానయాన సంస్థ బొంబాయి నుంచి విమానాన్ని పిలిపించి కొంతమంది ప్రయాణికులను అందులో గమ్యస్థానాలకు చేర్చే ప్రయత్నాలు చేశారు. మరి కొంతమంది ప్రయాణికులు విమాన టికెట్లను రద్దు చేసుకొని వేరే విమానాల్లో వెళ్లారు. ఈ మధ్యకాలంలో తరచూ ఇండిగో విమానాల్లో సాంకేతిక లోపాలు ఏర్పడుతున్నాయని ప్రయాణికులు భయాందోళనలు వ్యక్త పరుస్తున్నారు.

# శ్రీకాళహస్తి

## గంజాయి బ్యాచ్‌పై నిఘా

### 6మందిపై పిడి యాక్టు

శ్రీకాళహస్తి,నవంబర్ 29 ప్రభాతవార్త తిరుపతి జిల్లాలో గంజాయి,డ్రగ్స్ రవాణా,నిల్వ విక్రయం, వినియోగం,మాదక ద్రవ్యాల నేరాలను నిర్మూలించే కార్యక్రమాల్లో శ్రీకాళహస్తికి చెందిన 6 గురిపై పిడి యాక్టు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు జిల్లా ఎస్ పి సుబ్బరాయుడు ప్రకటన జారి చేసారు. నేరాలలో పదే పదే పాల్గొంటున్న నిందితులను గుర్తించి ప్రజా శాంతి భద్రతలకు భంగం కల్గించే వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకున్నట్లు వివరించారు.ఇప్పటికే 7 మందిపై పిడియాక్టు అమలు చేసినట్లు తెలిపారు.శ్రీకాళహస్తి వన్‌టౌన్,టూ టౌన్ తిరుచానూరు,తడ పోలీసు స్టేషన్స్‌లో కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.పిడి యాక్టులో కేసు నమోదు చేసిన వారిలో శ్రీకాళహస్తి శ్రీరామనగర్ కాలనీకి చెందిన కరణి సాయికుమార్ అనే స్పార్కిల్ సాయి(24)ఇతనిపై మొత్తం నాలుగు కేసులున్నట్లు పోలీసులు తెలిపారు. కాగా బృందమ్మ కాలనీకి చెందిన చెరుకూర్తి వంశీ(24) ఇతనిపై శ్రీకాళహస్తి వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో గంజాయి,మాదక ద్రవ్యాలకు సంబంధించిన కేసులున్నాయి విఎంపల్లికి చెందిన పైపూరి వేణుగోపాల్(45),ఇతనిపై శ్రీకాళహస్తి టూటౌన్ పోలీసు స్టేషన్‌లో గంజాయి, మాదక ద్రవ్యాల కేసులున్నట్లు పోలీసులు తెలిపారు. తిరుపతిపద్మావతి పురానికి చెందిన సాదు హరి(28),ఇతనిపై 13కేసులున్నట్లు తెలిపారు. నల్లామురళి అనే నక్కా మురళి(31) తడకు చెందిన వ్యక్తిపై 6కేసులున్నట్లు పేర్కొన్నారు.వీరిపై పిడి యాక్టు నమోదు చేసినట్లు తెలిపారు.

# కాణిపాకం సన్నిధిలో ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ



కాణిపాకం, నవంబర్ 29 ప్రభాతవార్త: ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ శివశంకర్ శనివారం కాణిపాకం శ్రీవర సిద్ది వినాయకస్వామివారిని దర్శించుకున్నారు. ఆయనకు పూతలపట్టు ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్ ఆలయ వద్ద ఘనంగా స్వాగతం పలికారు. ఆలాగే ఆలయ రాజగోపురం వద్ద ఆలయ ఛైర్మన్ మణి నాయుడు, ఈఓ కె.పెంచల కిషోర్, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆయన స్వామివారి సేవలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. ఆయనకు వేదమండపంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు. ఆలయ పాలకమండలి సభ్యులు చంద్రశేఖర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, సుబ్బారెడ్డి, నాగరాజునాయుడు, ఏపీఎస్పీడీసీఎల్ డైరక్టర్లు అయూబ్‌ఖాన్, గురవయ్య,ఎస్‌ఈ ఇస్మాయిల్ అహ్మద్, డీఈ మునిచంద్ర, పైపల్లె ఏడీఈ అరుల్‌లతో పాటు ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు. కాణిపాకం దేవస్థానంకు ఏపీఎస్పీడీసీఎల్ అవసరమైన సేవలందించడానికి ముందుంటామని సీఎండీ శివశంకర్ అన్నారు. కాణిపాకంలో అండర్ గ్రౌండ కేబుల్ ఏర్పాటుకు ఎస్టిమేట్‌లు తయారు చేసి పంపాలని ట్రాన్స్‌కో అధికారులను ఆదేశించారు.

# తిరుచ్చిపై "శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వెంకన్న"



చంద్రగిరి, నవంబర్ 29 ప్రభాతవార్త: శ్రీనివాస మంగాపురంలో వెలసియున్న కల్యాణ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో శనివారం శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వెంకన్న తిరుచ్చి వాహనంపై తిరుమాడ వీధులలో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. ఇందులో భాగంగా ఆలయ అర్చకులు స్వామి వారిని వేకువజామున సుప్రభాత సేవతో మేల్కొలిపి, తోమాల అర్చనాధి నిత్యకైంకర్యాలను ఆగమోక్తంగా నిర్వహించారు. సాయంత్రం శ్రీదేవి భూదేవి సమేత స్వామివారి ఉత్సవమూర్తులను వివిధ రకాల సుగంధ భరిత పుష్పాలు, బంగారు ఆభరణాలతో విశేష అలంకరణ గావించి తిరుచ్చి వాహనంపై అధిష్టింపజేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఇఓ ఎం.గోపినాథ్, సూపరింటెండెంట్ రాజ్‌కుమార్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ద్వారక మునికుమార్, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ అనుంబట్టు ధనశేఖర్, అర్చకులు కె.ఆర్.ఆంజనేయచార్యులు, జమేధర్ రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీలలో బంగారుపతకం



చిత్తూరురూరల్, నవంబరు 29 ప్రభాతవార్త: ఈనెల 24నుంచి 26వ తేది వరకు కోనసీమ జిల్లా జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల మోరీ నందు జరిగిన రాష్ట్రస్థాయి ఎస్‌జిఎఫ్ 17 ఫెన్సింగ్ పోటీలలో ఖేలో ఇండియా సెంటర్ నందు శిక్షణ పొందిన చిత్తూరుజిల్లా, కాణపాకం జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల విద్యార్థులు బంగారు, కాంస్యపతకం సాధించినట్లు జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి ఏ. బాలాజీ తెలిపారు. వ్యక్తిగత విభాగం నందు కె యువశ్రీ(కాంస్యపతకం) సాధించి డిసెంబర్ నెలలో శంభాజీ మహారాష్ట్రనందు జరగబోయే జాతీయ స్థాయి పోటీలలో పాల్గొనడం జరుగుతుందనీ,అలాగే టీమ్ విభాగంలో కె. నోహిత్ బంగారుపతకం సాధించినట్లు పేర్కొన్నారు. కాగా వీరిని జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి బాలాజీతో పాటు ఖేలో ఇండియా ఫెన్సింగ్ కోచ్ రాఘవ కార్తీక్ అభినందిస్తూ జాతీయస్థాయ పోటీలలో సైతం జిల్లాకు మంచిపేరు తీసుకురావాలని కోరారు.

# స్పోర్ట్స్ సిటీకు ఆమోదం లభించడంతో కలెక్టర్‌కు శాప్ చైర్మన్ రవినాయుడు కృతజ్ఞతలు



తిరుపతి క్రీడ, నవంబర్ 29, ప్రభాతవార్త

తిరుపతి నగరంలో జాతీయ స్థాయి క్రీడా మౌలిక వసతుల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర క్యాబినెట్ సమావేశంలో తిరుపతి దామినేడు ప్రాంతంలో 28 ఎకరాల భూమిని స్పోర్ట్స్ సిటీ కోసం కేటాయించాలని ఆమోదం తెలిపింది. తిరుపతిని క్రీడా హబ్‌గా అభివృద్ధి చేయాలని శాప్ చైర్మన్ రవి నాయుడు చేసిన అభ్యర్థన మేరకు గతంలో తిరుపతి జిల్లా కలెక్టర్ రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధిత ప్రతిపాదనలు పంపిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ నెల 28వ తేది జరిగిన క్యాబినెట్ సమావేశంలో స్పోర్ట్స్ సిటీ ఏర్పాటుకు ఆమోదం లభించడంతో శాప్ చైర్మన్ రవి నాయుడు ఆధ్వర్యంలో రాష్ట్ర యాదవ్ కార్పొరేషన్ స్టేట్ చైర్మన్ నరసింహ యాదవ్, తిరుపతి శ్రీతాతయ్య గుంట గంగమ్మ గుడి చైర్మన్ మహేష్ యాదవ్, తిరుపతి జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ డి.ఎస్.డి.ఓ శశిధర్, కోచులు, సిబ్బంది కలిసి జిల్లా కలెక్టర్ ఎస్. వెంకటేశ్వర్‌ని మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. రవి నాయుడు మాట్లాడుతూ తిరుపతిని క్రీడా హబ్‌గా తీర్చిదిద్దేందుకు జిల్లా కలెక్టర్ చూపిస్తున్న కృషి ప్రశం సనీయం. రానున్న రోజుల్లో దక్షిణభారతదేశానికి తిరుపతి ప్రముఖ క్రీడాకేంద్రంగా అవతరించనుంది అని వెల్లడించారు.

# తుఫాన్‌తో అన్నదాతల్లో అలజడి

**తిరుపతిజిల్లాలోని తూర్పు నియోజకవర్గాలు శ్రీకాళహస్తి, సత్యవేడులు వ్యవసాయ భాండాగారాలు. ఏడాదిలో ముందస్తు ఖరీఫ్ సీజన్ జూన్ నుంచి అక్టోబర్ వరకు వెలిది పంటలు, వాణిజ్యపంటలను పండిస్తారు. నవంబర్ నుంచి ఫిబ్రవరి వరకు రబీ పంటలుగా అత్యధికంగా వరి పండిస్తారు. గత కొన్ని సంవత్సరాలుగా రుతుపవనాల ద్వారా వానలు ప్రశ్నార్థకంగా మారింది. ఈ ఏడాది అక్టోబర్ మాసంలోనే అక్టోబర్ నవంబర్‌మాసాలకు సంబంధించిన వర్షాలు కురిసాయి. చెరువులు,ప్రజెక్టులు నిండాయి.ఆనందోత్సాహాలతో అన్నదాతలు కొందరు నార్లు పోసుకొని నాట్లు కోసం సిద్దం కాగా మరి కొందరు నాట్లు వేసుకున్నారు. ప్రస్తుతం ద్విత్వా తుఫానుతో భారీ వర్షాలు అనే సంకేతాలతో అన్నదాతలు అల్లాడుతున్నారు.ప్రతి సారి మద్దతు ధరలు లేక ఇబ్బంది పడితే ప్రస్తుతం వేసిన పంటలను ఎలా దక్కించుకోవాలో తెలియక తల్లడిల్లుతున్నారు.**



శ్రీకాళహస్తి,నవంబర్ 29 ప్రభాతవార్త ఉమ్మడి చిత్తూరుజిల్లా అన్నపూర్ణగా వ్యవహించిన ప్రస్తుత తిరుపతి జిల్లాలోని శ్రీకాళహస్తి, సత్యవేడు నియోజకవర్గాల్లో వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి.ఈ నేపథ్యంలో దిత్వా తుఫాను అన్నదాతల్లో అలజడి రేపుతుంది. శుక్రవారం నుంచి తుఫాను ప్రభావం ఉండగా శనివారం ఉదయం నుంచి ఈదురుగాలులతో చలితో వణుకుతున్నారు.జ్వరాలతో అల్లాడుతున్నారు.అన్నదాతలు వేసిన పంటలను ఎలా రక్షించుకోవాలనే తపనతో ఉన్నారు. గతంలో వర్షాభావంతో వ్యవసాయం ఎత్తుభారంగా మారగా ప్రస్తుతం తుఫాన్లు గందరగోళం సృష్టిస్తున్నాయి. పదేళ్ళ క్రితం వర్షపు చరిత్ర చూస్తే శ్రీకాళహస్తి నియోజకవర్గంలో సాధారణ సగటు వర్షపాతం 1300 మి.మీలు కాగా 2300 మి.మీల వరకు నమోదైన సందర్భాలున్నాయి.

**చెరువుల మీద వ్యవసాయం:**

శ్రీకాళహస్తి సత్యవేడు నియోజవర్గంలో అత్యధిక భాగం వ్యవసాయం చెరువుల మీదనే ఆధారపడి సాగుతుంది.ఈ నేపథ్యంలో శ్రీకాళహస్తి వ్యవసాయ ఇరిగేషన్ డివిజన్‌లో సుమారు 450 పెద్ద చెరువులున్నాయి. మరో మూడు వందలకుపైగా చిన్న చెరువులున్నాయి. వీటి ద్వారా సుమారు 32వేల హెక్టార్లలో వ్యవసాయం సాగుతుంది.ప్రతి ఏడాది చెరువులు నిండటానికి డిసెంబర్ చివరి వరకు ఆగాల్సి వచ్చేది.అయితే ఈ ఏడాది ప్రకృతి కరుణించి అక్టోబర్ మాసం వర్షంతోనే చెరువు నిండాయి.బావుల్లో నీటి మట్టం పెరిగింది. దాంతో రైతులు అత్యూత్సాహంతో పంటల సాగుపై దృష్టి సారించారు.ఇప్పటికే తెలుగుగంగ పరివాహక ప్రాంతాల్లో వరి పైరు నాట్లు జరిగాయి. శ్రీకాళహస్తి మండలంలోని పలు ప్రాంతాల్లో నార్లు పోసుకొని నాట్లు కోసం ఎదురు చూస్తున్నారు.ఈ పరిస్థితిలో దిత్వా తుఫాను శాపంలా మారింది. నాలుగు రోజులు వర్షాలంటే నాట్లు వేసిన పంటలు నిలుస్తాయా? లేదా? అనేది సందేహంగా మారిందని వాపోతున్నారు.

**చలిపెరిగింది: వణుకుతున్నజనం:**

దిత్వా తుఫాను ప్రభావం శనివారం ఉదయం నుంచి చోటు చేసుకుంది. ఉదయం నుంచి ముసార పట్టుకుంది. మరో వైపు ఈదురు గాలులు అధికంగా ఉన్నాయి. దాంతో జనం చలి భారంతో తల్లడిల్లుతున్నారు. వణుకుతున్నారు. అప్పుడే జ్వరాలతో ప్రైవేటు క్లీనిక్‌ల వద్ద క్యూ కడుతున్నారు.

# రైతులు ప్రకృతి సేద్యం సాగుపై దృష్టి సారించాలి

### - రాష్ట్ర రైతు సాధికార సంస్థ ఇ.డి. నీరజ



కుప్పం, నవంబర్ 29 ప్రభాతవార్త రైతులు ప్రకృతి వ్యవసాయం సాగుపై దృష్టి సారించాలని రాష్ట్ర రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, విశ్రాంత ఐఎఫ్‌ఎస్ అధికారి వి.నీరజ సూచించారు. శనివారం కుప్పం, గుడుపల్లె, శాంతిపురం, రామకుప్పం మండలాల్లో ఆమె పర్యటించి పలు ప్రకృతి వ్యవసాయ పంట పొలాలను పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడారు.సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో ప్రకృతి వ్యవసాయాన్ని అధికంగా ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు. ప్రకృతి వ్యవసాయ విధానంపై తగు శిక్షణ ఇచ్చేందుకు రైతు సాధికార సంస్థ అధికారులు, సిబ్బంది సిద్ధంగా ఉన్నారన్నారు. ప్రకృతి సాగు ఉత్పత్తుల వినియోగంతో ఆరోగ్యం కూడా మెరుగుపరచుకోవచ్చని రైతులకు సూచించారు. ఎ గ్రేడ్, ఎటిఎంతో పాటు రైతు సాధికార సంస్థ రూపొందించిన పలు మోడళ్లను పరిశీలించారు. అనంతరం బయో ఇన్‌పుట్ రిసోర్స్ సెంటర్‌ను సందర్శించారు. కార్యక్రమంలో డిపిఎం అమృతవల్లి, నోడల్ అధికారి బాజీబాబు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## అక్రమ కట్టడాల క్రమబద్ధీకరణకు బిపిఎస్ స్కీమ్ : కమీషనర్

కుప్పం, నవంబర్ 29 ప్రభాతవార్త



సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో కుప్పం మున్సిపాలిటీలో 1985-2025 ఆగస్టు 31వరకు అక్రమంగా నిర్మించుకున్న కట్టడాలు, ప్లాన్‌కు విరుద్ధంగా నిర్మించిన కట్టడాలను క్రమబద్ధీకరించేందుకు ప్రజలు ప్రభుత్వం కల్పించిన బిల్డింగ్ పీనలైజేషన్ స్కీమ్‌ను సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమీషనర్ శ్రీనివాసరావు కోరారు. రూ 10వేలు చెల్లించి పురపాలక కార్యాలయంలో మార్చి 11లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్లాట్ సైజు, భవనం రకం, మార్కెట్ ధర ఆధారంగా తుది ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు.భవన రిజిస్టర్ డాక్యుమెంట్, ప్లాన్‌అనుమతి కాపీ, ఇసి, మార్కెట్ వాల్యూ సర్టిఫికెట్, ప్రస్తుత భవన ఫోటోలు తదితరాలు జత పరచాల్సి ఉంటుందన్నారు. కాగా 31-12-1997కి ముందు నిర్మించిన భవనాలకు 25శాతం రాయితీ ఉంటుందన్నారు. ఇతర వివరాలకు మున్సిపల్ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

## ఉపాధ్యాయులకు ఆటల పోటీలు

**రామకుప్పం, నవంబర్ 29 ప్రభాతవార్త** ప్రభుత్వ ఆదేశాల మేరకు శనివారం ఉపాధ్యాయులకు క్రీడా పోటీలను ఎంఇఒ నారాయణ అధ్వర్యంలో నిర్వహించారు. పురుష ఉపాధ్యాయులకు క్రికెట్, మహిళా ఉపాధ్యాయులకు త్రోబాల్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

## ద్విచక్రవాహనాలు ఢీ..ఒకరి మృతి

**కుప్పం, నవంబర్ 29 ప్రభాతవార్త** స్థానిక బైపాస్ రోడ్‌లో హెచ్‌పి పెట్రోల్ బంకు సమీపంలో రెండు టువీలర్లు ఢీకొన్న సంఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన మేరకు వివరాలిలా.. మండలంలోని బంగానత్తంకు చెందిన జయరాం (58) టువీలర్‌లో వస్తుండగా వెనుకవైపు నుంచి వచ్చి మరో టువీలర్ జయరాం వాహనాన్ని ఢీకొనడంతో జయరాం మృతి చెందాడన్నారు. అలాగే అతన్నివాహనాన్ని ఢీకొన్న వ్యక్తికి సైతం గాయాలు కాగా ఆస్పత్రిపాలైనట్లు తెలిపారు. ఇతనిది బాబయ్యమఠం ప్రాంతంగా గుర్తించామ న్నారు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నట్లు తెలిపారు.

## డిసెంబర్ 6 వరకు టెన్త్ పరీక్షల ఫీజు చెల్లింపు గడువు పొడిగింపు

**చిత్తూరు, నవంబర్ 29 ప్రభాతవార్త:** 2026 మార్చిలో టెన్త్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు టెన్త్ పరీక్షల ఫీజు చెల్లింపు గడువును డిసెంబర్ 6వ తేదీ వరకు పొడిగించినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి వరలక్ష్మీ తెలిపారు. ఇది వరకు టెన్త్ విద్యార్థులకు పరీక్షల ఫీజు చెల్లింపు గడువు నవంబర్ 26వ తేదీ వరకు వుండేదని, అయితే ప్రస్తుతం పొడగించిన పరీక్షల ఫీజు గడువుతో జిల్లాలోని గుర్తింపు పొందిన అన్ని యాజమాన్య పాఠశాలల్లో టెన్త్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల ఫీజులను ఎలాంటి అపరాధ రుసుం లేకుండా డిసెంబర్ 6వ తేదీ వరకు చెల్లించవచ్చున్నారు. అలాగే రూ.50 అపరాధ రుసుంతో డిసెంబర్ 9వ తేదీ వరకు, రూ.200 అపరాధ రుసుంతో డిసెంబర్ 12వ తేదీ వరకు, రూ.500 అపరాధ రుసుంతో డిసెంబర్ 15వ తేదీ చెల్లించవచ్చునన్నారు. రెగ్యులర్ విద్యార్థులు అన్ని సబ్జెక్టులకు రూ.125, ప్రైవేటు విద్యార్థులు 3 కంటే ఎక్కువ సబ్జెక్టులకు రూ.125, 3 కంటే తక్కువ సబ్జెక్టులకు రూ.110, ఒకేషనల్ విద్యార్థులు రెగ్యులర్ ఫీజుతో పాటు అదనంగా రూ.60, అండర్ ఏజ్ విద్యార్థుల ఫీజు రూ.300 ఆన్‌లైన్‌లో చెల్లించాలన్నారు.

## పౌరులకు సాధికారత కల్పించడమే సమాచార హక్కు చట్టం ఉద్దేశం

- జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్‌కుమార్



**చిత్తూరు, నవంబర్ 29 ప్రభాతవార్త:** దేశ పౌరులకు సాధికారత కల్పించడమే ఇన్ఫర్మేషన్ యాక్ట్-2005 ముఖ్య ఉద్దేశమని జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్ కుమార్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని ప్రత్యేక సమావేశభ వనంలో శనివారం ఇన్ఫర్మేషన్ యాక్ట్-2005 అనే అంశం పై జిల్లా అధికారులతో అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సదసుకు హాజరైన జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్‌కుమార్ మాట్లాడుతూ దేశ ప్రజలకు వివిధ ప్రభుత్వ సంస్థల యంత్రాంగాలకు సంబంధించి సమాచారంను తెలుసుకునే హక్కు సమాచార హక్కు చట్టం కల్పించడం జరిగిందన్నారు. సమాచార హక్కుకు సంబంధించిన నియమ నిబంధనలు, విధి విధానాలను ఈ చట్టం నిర్దేశిస్తుందన్నారు. ఈ చట్టం నందు 6 భాగాలు, 31 సెక్షన్లు వున్నాయన్నారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో సహాయ ప్రజా సమాచార అధికారి, ప్రజా సమాచార అధికారి, అపిలేట్ అధికారి పేర్లను ప్రతి కార్యాలయంలోను సమాచార హక్కు చట్టానికి సంబంధించి బోర్డులు ఏర్పాటు చేయాలని, అలాగే సమాచార హక్కు చట్టంకు సంబంధించి రిజిస్టర్లను నిర్వహించాలన్నారు. గతంలో లేకపోయినా ఇప్పటి నుండి అయిన కార్యాలయాల్లో బోర్డులు, రిజిస్టర్లను పక్కాగా నిర్వహించేలా చేయాలన్నారు. రిటైర్డ్ తహసిల్దారు రఘుపతి మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం- 2005 కింద ఎవరైనా ఏదైనా అడగవచ్చు నన్నారు. దీనికి సంబంధించి ఐదు రోజుల్లో వివరణ ఇవ్వా లని, ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ నియంత్రణలో వున్న కార్యాలయాలు సెక్షన్-2 పరిధిలోకి వస్తాయన్నారు.జిల్లా అధికారులు, తహసిల్దార్లు, సమాచార హక్కు చట్టం-2005 చూస్తున్న అధికారులు, పాల్గొన్నారు.

## అలరించిన కృష్ణవేని వీణా కచ్చేరి



**శ్రీకాళహస్తి,నవంబర్ 29 ప్రభాతవార్త** శ్రీకాళహస్తీశ్వరాలయం కళలు,కళాకారులకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారు.ఈ నేపధ్యంలో సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు ప్రత్యేక వేదికను ఏర్పాటు చేసి సంప్రదాయ కళలకు అవకాశం కల్పిస్తున్నారు.ఈ నేపధ్యంలో శనివారం కృష్ణవేణి వీణా సంగీత నీరాజనం ప్రేక్షకులను ఆకట్టుకుంది.వీణా కచ్చేరిని తిరుపతి శ్రీవాణి ఎల్లా చే కచ్చేరి నిర్వహించారు. ఈ సందర్బంగా కార్యక్రమాలను డెప్యూటి ఇఒ ఎన్ ఆర్ కృష్ణారెడ్డి జ్యోతి ప్రజ్వాలన చేసి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఆలయానికి సంబంధించిన కళావేదిక మండపంలో కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో మినిస్ట్రీ ఆఫ్ టూరిజం భారత ప్రభుత్వం ఎపి టూరిజం శాఖ సారథ్యంలో నిర్వహించిన కార్యక్రమాల్లో రిజినల్ డైరెక్టర్ వెంకటేషన్, రీజినల్ డైరెక్టర్ ఎపి టూరిజం డాక్టర్ రమణ ప్రసాద్, ఇండియన్ కలినరీ ఇన్సిట్యూట్ డాక్టర్ త్రిలోకచందర్,ఎఇఒ హేమామాలిని, పర్యవేక్షకులు లావణ్యలు హాజరయ్యారు.

## శ్రీకాళహస్తి నియోజకవర్గ కమిటీలపై కసరత్తు



**శ్రీకాళహస్తి,నవంబర్ 29 ప్రభాతవార్త** శ్రీకాళహస్తి నియోజకవర్గంలో గ్రామీణ స్థాయిలో కమిటీల ఏర్పాటుకు కసరత్తు ప్రారంభం అయ్యింది. శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి చైర్మెన్ కొట్టె సాయి శనివారం అమరావతిలోని జనసేన పార్టీ కార్యాలయంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పౌరసరఫరాల శాఖ మంత్రి నాదేండ్ల మనోహర్‌ను మర్యాదపూర్వకంగా కలిసారు. ఆయనకు స్వామి అమ్మవార్ల తీర్థ ప్రసాదాలను అందించారు. ఈ సందర్భంగా ఆయనతో స్థానికంగా జరుగుతున్న సంఘటనలకు సంబంధించి కొట్టెసాయి వివరించారు. ఇక పార్టీని గ్రామీణ స్థాయి నుంచి బలోపేతం చేయటానికి పార్టీ నిర్మాణం, సంస్థాగత వ్యవహారాలు, స్థానికంగా ఉన్న సమస్యలు వివిధ వర్గాల కమిటిలు ఏర్పాటు వంటి అంశాలపై మంత్రికి వివరించారు. క్షేత్ర స్థాయిలో పార్టీ పటిష్టతకు తీసుకుంటున్న చర్యలను ఆయన తెలిపారు.ఈ సందర్భంగా నాదేండ్ల మనోహర్ కొట్టెసాయికి దిశ దేశ నిర్దేశం చేస్తూ రాబోయే స్థానిక ఎన్నికలకు పార్టీని సమాయత్తం చేయాలన్నారు. ఇక చైర్మెన్‌గా శ్రీకాళహస్తీశ్వరాలయంలో చోటు చేసుకుంటున్న సంఘటనలకు సంబంధించి కొట్టె సాయి మంత్రికి వివరించారు.ఆలయంలో పారదర్శకత, నిజాయితి పరిపాలనకు సంబంధించి రాహుకేతుదోష నివారణ పూజల్లో బలవంతపు వసూళ్లకు సంబంధించి తాను తీసుకున్న నిర్ణయాన్ని మంత్రికి వివరించినట్లు సమాచారం.

## అగ్నిప్రమాదాలపై అవగాహన కలిగి వుండాలి

**పుత్తూరు, నవంబరు 29 ప్రభాతవార్త :**



అగ్ని ప్రమాదాల పట్ల ప్రతి ఒక్కరు అవగాహన కలిగి వుండాలని, చిన్న నిర్లక్ష్యం పెద్ద ప్రమాదాలకు దారి తీస్తుందని ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ బి.చంద్రమౌళి అన్నారు. శనివారం ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో అగ్ని ప్రమాదాలు, నివారణ చర్యలు అనే అంశంపై సిటిఆర్ నెత్తం గ్రామంలో అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాధారణంగా అగ్ని ప్రమాదాలు నిర్లక్ష్యం వల్లే జరుగుతాయన్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న పుత్తూరు అగ్నిమాపక శాఖాధికారి గిరిధర్ మాట్లాడుతూ విద్యుత్ పరికరాల భద్రత, గ్యాస్ స్టవ్ ప్రమాదాలు, పెట్రోలు, డీజిల్ వంటి మండే పదార్థాల విషయంలో అప్రమత్తంగా వుండాలని సూచించారు. ప్రతి ఇంట్లో మంటలను ఆర్పే పరికరాలు వుండాలన్నారు. అగ్ని ప్రమాదం జరిగిన వెంటనే 101 నెంబర్‌కు ఫోన్ చేయాలని తెలిపారు. ఫైర్ ఆఫీసర్ మనోజ్‌కుమార్‌తో కలిసి గ్యాస్ లీకై మంటలు ఏర్పడినపుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రయోగాత్మకంగా వివరించారు. సమావేశంలో ఎన్ఎస్ఎస్ అధికారులు డాక్టర్ కె.శ్రీనివాసులు, వి.బాబూరావు, ఐక్యుఎసి సమన్వయకర్త డాక్టర్ పి.సుజన, స్థానిక ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు లక్ష్మీప్రసన్న తదితర ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

## అమరంకండ్రిగ గ్రామంలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని వినతి



**పుత్తూరు రూరల్, నవంబరు 29 ప్రభాతవార్త:** పుత్తూరు మున్సిపాలిటీ 12వ వార్డు అమరం కండ్రిగ గ్రామంలో ఉన్న సమస్యలకు అధికారులకు పరిష్కారం కొరకు చొరవ తీసుకోవాలని, దీంతో ప్రజలు పడుతున్న ఇబ్బందులను తొలగించాలని తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి బూత్ ఇన్‌చార్జి శాఖమూరి గోపికృష్ణ ఆధ్వర్యంలో శనివారం మున్సిపల్ కమిషనర్‌కి గ్రామంలో వినతిపత్రం అందజేశారు. ఈ విన్నపం మేరకు గ్రామంలోకి వచ్చిన కమిషనర్‌కి ఇక్కడ ఉన్న సమస్యలు నందిమంగళం నుంచి అమరంకండ్రిగకి సరైన రోడ్డు(సీసీ) రోడ్డు, గ్రామం నుంచి శ్మశానంకి వెళ్లే దారి ఏర్పాటుచేయడం, నీటి సమస్య, స్ట్రీట్ లైట్లు ఏర్పాటు, మెరుగైన పారిశుధ్యం శానిటరీ నిర్వహణ తదితర సమస్యలకు త్వరగా పరిష్కారం చూపాలని కోరామన్నారు. దీంతో కమిషనర్ అన్ని సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

## 12 లక్షలతో మరుగుదొడ్ల నిర్మాణం

సదుం నవంబర్ 29 ప్రభాతవార్త



సదంలోని కొత్తపల్లిలో వెలసిన శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయం వద్ద స్వచ్ఛభారత్ మిషన్ స్వచ్ఛంద కార్పొరేషన్ ఆధ్వర్యంలో 12లక్షల వ్యయంతో మరుగుదొడ్లు నిర్మించినట్లు డి ఈ ఈ కిషోర్ తెలిపారు. వాటిలో నాలుగు పురుషులకు, నాలుగు స్త్రీలకు స్నానపు గదులు మరియు టాయిలెట్స్ ను వేరు వేరుగా నిర్మించామని చెప్పారు. ఆలయం వద్ద భక్తులు వీటిని వినియోగించుకోవచ్చునని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఈ ప్రసన్నకుమార్, ఏఈ ఆదినారాయణ ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## రైతులు రుణాల కోసం దరఖాస్తు చేసుకోండి

సదుం నవంబర్ 29 ప్రభాతవార్త



రైతులు రుణాల కోసం దరఖాస్తులు చేసుకోవాలని సదుం సింగిల్ విండో ప్రెసిడెంట్ సునీల్ కుమార్ రెడ్డి అన్నారు శనివారం స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో బోరబండకు చెందిన రైతులకు రుణాలను పంపిణీ చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట రుణంతోపాటు వ్యవసాయ పొలాన్ని అభివృద్ధి చేసుకునేందుకు వేరుగా రుణాలు చేస్తామన్నారు అదేవిధంగా జిల్లా అభివృద్ధికి కూడా సమయాన్ని తగ్గట్టు రుణాన్ని అందజేస్తామని వివరించారు ఈ కార్యక్రమంలో గొంగి వారి పల్లె మాజీ ఎంపీటీసీ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

గంగాధర నెల్లూరు నవంబరు 29 ప్రభాతవార్త:



మండలంలోని వేల్కూరు పంచాయతీ గ్రామాలలో శనివారం రాష్ట్ర ప్రభుత్వాదేశాల మేరకు మండల పార్టీ అధ్యక్షుడు స్వామిదాస్ ఆధ్వర్యంలో రైతన్న మీ కోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన పెనుమూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ ఈ కృష్ణమ నాయుడు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలోని రైతుసంక్షేమం సాధ్యమని దీని కోసం మన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అహర్నిశలు రైతు అభివృద్ధి కోసమే కృషి చేస్తున్నారని రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో వున్న రైతన్నలకు రైతు భరోసారైతు బందు రాయితీతో వ్యవసాయ పనిముట్లు పంపిణీ సబ్సిడి పశుదాన లతో పాటు పలు పథకాలను అమలు చేసి రైతుల కోసం మేమున్నామంటూ భరోసా ఇవ్వటం మీరే చూస్తున్నారని అన్నారు.అనంతరం రైతన్న మీకోసం కరపత్రాలు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా యాదవ సాధికారత అధ్యక్షులు శ్రీధర్ యాదవ్ చిన్న బుజ్జి మునస్వామి శంకర్ వెంకటేష్ చక్రవర్తి సురేష్ లతో పాటు కూటమి నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి యోగాసన పోటీలలో సత్తా చాటిన దీపిక

యర్రావారిపాళెం, నవంబర్ 29, ప్రభాతవార్త:



రాష్ట్రస్థాయి యోగాసన పోటీలలో యర్రావారిపాలెం మండలం, కోటకాడపల్లికి చెందిన బత్తి దీపిక తన సత్తా చాటింది. 69వ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ యోగాసన స్పోర్ట్స్ చాంపియన్ షిప్ అండర్ 14, అండర్ 17, అండర్ 19 బాల బాలికల యోగాసన పోటీలు బాపట్ల, పంగలూరు మండలంలో నిర్వహించారు. ఈ పోటీలలో మారుమూల ప్రాంతమైన యర్రావారిపాలెం మండలం, కోటకాడ పల్లికి చెందిన బత్తి దీపిక అండర్ 19 బాలికల విభాగంలో ట్రెడిషనల్ యోగాసన పోటీల్లో రెండవ స్థానంలో నిలిచి కాంస్య పతకం, మెడల్ సాధించింది. అలాగే ఆర్టిస్ట్ యోగాసన సింగిల్ (మ్యూజికల్) విభాగంలో రెండవ స్థానంలో నిలిచి కాంస్య పతకం కైవసం చేసుకున్నారు. దీంతో విద్యార్థిని తల్లితండ్రులు బత్తి శ్రీరాములు, లక్ష్మిదేవి సంతోషం వ్యక్తం చేశారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా స్కూల్ గేమ్ సెక్రటరీలు, అధ్యక్షులు ప్రత్యేకంగా అభినందించారు. ప్రస్తుతం బత్తి దీపిక తిరుపతి అనిల్ అద్వైత జూనియర్ కాలేజ్‌లో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నది. ఈ సందర్భంగా దీపిక మాట్లాడుతూ తనకు చాలా సంతోషంగా ఉందని, యోగాలో గత మూడు సంవత్సరాలుగా వివిధ రాష్ట్రస్థాయి, జాతీయస్థాయిలో యోగాసన స్పోర్ట్స్ చాంపియన్ షిప్ పోటీలలో పాల్గొంటున్నానని అన్నారు. దీనికి కారణం తల్లిదండ్రుల ప్రోత్సాహం అని తెలిపారు. అదే విధంగా యోగ మాస్టర్ సుబ్రహ్మణ్యంకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. యోగా ద్వారా మానసిక ఒత్తిడి తగ్గి, శారీరక దృఢత్వం పెరుగుతుందన్నారు. యోగాలో గెలుపొందిన సర్టిఫికెట్లు కాంపిటీటివ్ ఎంట్రన్స్ ఎగ్జామ్స్‌లో, ఉద్యోగ అవకాశాలలో మూడు శాతం స్పోర్ట్స్ కోట రిజర్వేషన్ ఉపయోగ పడతాయని చెప్పారు.

## రొంపిచెర్లను మదనపల్లి జిల్లాలో కలపాలి

రొంపిచెర్ల, నవంబర్ 29, ప్రభాతవార్త:



రొంపిచెర్ల మండలాన్ని మదనపల్లి జిల్లాలో కలపాలని మండల ప్రజలు తహసీల్దార్ కిరణ్ కుమార్‌కు వినతి పత్రం సమర్పించారు. పుంగనూరు నియోజకవర్గంలోని రొంపిచెర్ల మండలాన్ని చిత్తూరు జిల్లాలో ఉంచి, చిత్తూరు రెవిన్యూ డివిజన్‌గా కేటాయించి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని అన్నారు. మదనపల్లి జిల్లా, పీలేరు రెవెన్యూ డివిజన్‌కు 3 కిలోమీటర్ల దూరంలో రొంపిచెర్ల మండలం ఉందన్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం రెవిన్యూ డివిజన్ చిత్తూరుకు కేటాయిస్తే మండల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. రొంపిచెర్ల మండలాన్ని పీలేరు రెవెన్యూ డివిజన్‌లో కలపకుండా ఉంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ వాటర్ షెడ్ చైర్మన్ కె.హరిక్రిష్ణా రెడ్డి, దూదేకుల నూర్బాష సంఘం జిల్లా అధ్యక్షుడు గుమ్ముదూరు నూరేషా, మాజీ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు ఓబులేషు, మైనార్టీ నాయకులు బావాజీ సాహెబ్, మండల దివ్యాంగుల సంఘం సభ్యులు ఆనందరాజు, ప్రజలు బాబు తదితరులు పాల్గొన్నారు.

## మండల ఉపాధ్యాయిని, ఉపాధ్యాయుల క్రీడా పోటీలు

కల్లూరు, నవంబర్ 29, ప్రభాతవార్త



మండల ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు క్రీడా పోటీలు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మేల్ టీచర్స్‌కి క్రికెట్ టీమ్‌ని, ఫిమేల్ టీచర్స్‌కి త్రోబాల్ టీంని ఎన్నిక చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జడ్పిహెచ్ఎస్ కల్లూరు క్రీడా మైదానంలో మండల విద్యాశాఖాధికారుల సి. సిద్ధరామయ్య, పి. తాతయ్య సమక్షంలో ప్రధానోపాధ్యాయురాలు వి. శ్రీవాణి, వ్యాయామ దర్శకులు క్రీడలను నిర్వహించారు. పురుషుల క్రీడావిభాగంలో నాలుగు జట్టులు పాల్గొన్నారు. అందులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 16 మందిని తుది జట్టుకు ఎంపిక చేసారు. ఈ ఎంపికైన జట్టు డివిజన్ స్థాయిలో పులిచెర్ల మండల జట్టుగా పాల్గొన్నారు. ఇదే విధంగా మహిళాల విభాగంలో త్రోబాల్ జట్టుకు పాల్గొన్న ఉపాధ్యాయునిలలో ప్రతిభ కనబరిచిన 12 మంది క్రీడాకారిణులని, తుది జట్టుకు ఎంపిక చేసారు.

## రైతుల సంక్షేమానికే పంచసూత్రాల కార్యక్రమం

- ఆర్టీసీవైస్‌చైర్మన్ పిఎస్ మునిరత్నం



**కుప్పం, నవంబర్ 29 ప్రభాతవార్త** సిఎం చంద్రబా బునాయుడు రైతుల సంక్షేమానికే పంచసూత్రాలు కార్యక్రమం తీసుకువచ్చారని ఆర్టీసీ వైస్‌చైర్మన్ పిఎస్ మునిరత్నం పేర్కొన్నారు.శనివారం నూలుకుంట గ్రామంలో రైతన్నా..మీకోసం కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. రానున్న ఐదేళ్లలో ఐదువి ధానాలతో ఈ కార్యక్రమం రూపకల్పన చేశారన్నారు. నీటిభద్రత, డిమాండ్ ఆధారిత పంటలసాగు, అగ్రిటెక్, ఫుడ్ ప్రాసెసింగ్, ప్రభుత్వంనుంచి మద్దతు ధర కల్పన లక్ష్యాలతో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. కుప్పంలో సైతం రైతులకు కృష్ణాజలాలు తేవడం తో పాటు పరిశ్రమలు తీసుకువస్తున్నారన్నారు. ఈసందర్భంగా ఇంటింటికి వెళ్లి రైతులకు పంచసూత్రాల కార్యక్రమంపై కరపత్రాలు పంపిణీ చేశారు.కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు రాజగోపాల్, మాజీ ఎంపిపి సాంబశివం, కనీస వేతనాల సలహాకమిటీ సభ్యుడు శరవణ, క్లస్టర్ ఇన్‌చార్జ్ హైదర్ వలీ, పిఎసిఎస్ చైర్మన్ కృష్ణమూర్తి, కడ సభ్యుడు రామచంద్ర, కాణిపాకం ఆలయ డైరెక్టర్ వసంతమ్మ,ఎఎంసి డైరెక్టర్ సుబ్బు, వ్యవసాయాధికారి ఫయాజ్, సిరికల్చర్ ఎడి మోహన్‌బాబు, వెటర్నరీ అధికారి రవిశంకర్, కో క్లస్టర్ ఇన్‌చార్జ్ గాయత్రి, నేతలు బాదుషా, మురుగేష్, వల్లెప్ప, అక్మల్ పాల్గొన్నారు.

## రేపు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

- కడ పి.డి. వికాస్ మర్మత్



కుప్పం, నవంబర్ 29 ప్రభాతవార్త

నియోజకవర్గ స్థాయిలో కుప్పం మండల కార్యాలయంలో డిసెంబర్ 1న సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ తెలిపారు. ఉదయం 10గంటలనుంచి మధ్యాహ్నం 1 గంట దాకా ఈకార్యక్రమం జరుగుతుందన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## క్రీడలతో ఒత్తిడి దూరం



చౌడేపల్లి, నవంబర్ 29 ప్రభాతవార్త

క్రీడలు మానసిక ఒత్తిడిని దూరం చేసేందుకు ఎంతగానో ఉపయోగపడతాయని ఎంఇఒలు కేశవరెడ్డి, తిరుమలమ్మలన్నారు. మండలంలోని దుర్గసముద్రం పంచాయతీ డి.రాజులూరు వద్దగల కెపిఎల్ మైదానంలో మండలస్థాయిలోని ఉపాధ్యాయనీ, ఉపాధ్యాయులకు క్రీడాల పోటీలు నిర్వహించారు. నిత్యం విద్యార్థులకు పాఠాలు బోధించే క్రమంలో ఉపాధ్యాయులు తీవ్ర ఒత్తిడులకు గురవుతరన్నారు. అలాంటి తమకు క్రీడలు ఎంతో ఉపయుక్తంగా వుంటాయన్నారు. డివిజన్ స్థాయిలో జరిగే పోటీలకు ప్రస్తుతం జరిగే పోటీల్లో ఉపాధ్యాయులను ఎంపిక చేయడం జరుగుతుందని వారన్నారు. ఈమేరకు క్రికెట్ టీమును ఎంఇఒ కేశవరెడ్డి, మహిళల త్రోబాల్ టీమును రెండవ ఎంఇఒ తిరుమలమ్మలు ఎంపిక చేస్తున్నట్లు వివరించారు. మండలంలోని ఉపాధ్యాయనీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## వేణుమాధవునికి ఫల పంచామృతాభిషేకం

చౌడేపల్లి, నవంబర్ 29 ప్రభాతవార్త



స్థానిక రుక్మిణీ, సత్యభామా సమేత వేణుగోపాల స్వామికి ఫల పంచామృతాభిషేకానికి శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు వశిష్టాచార్యులు, వేదపండితుల సమక్షంలో అలయం నందు పలు కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా ఆలయాన్ని రుక్మిణీ, సత్యభామా సమేత వేణుగోపాలస్వామిలను వివిధ రకాల పూలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. భక్తులకు పవిత్ర తీర్థ ప్రసాదాలందించారు.

## దిత్వా తుఫాన్‌తో రైతులు అప్రమత్తంగా వుండాలి : మోహన్‌కుమార్

చౌడేపల్లి, నవంబర్ 29 ప్రభాతవార్త

దిత్వా తుఫాన్‌తో రైతులు అప్రమత్తంగా వుండాలని మండల వ్యవసాయాధికారి మోహన్ కుమార్ అన్నారు. స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ దిత్వా తుఫాన్ మూలంగా రాబోయే రెండు రోజులపాటు వర్షం కురిసే అవకాశముందని వాతావరణశాఖ తెలిపిందన్నారు. రైతులు వరిపంటను వర్షం తగ్గేవరకు కోయరాదన్నారు. వర్షపునీటిని పొలంలో నుంచి బయటకు వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. నీటిలో మునిగిన వరికోసం ధాన్యాలు మొలకెత్తకుండా కాపాడటానికి అదనపునీటిని తీసివేసి తర్వాత 5శాతం సాధారణ ఉప్పుద్రావణాన్ని(ఒక లీటరు నీటిలో 50గ్రాముల సాధారణ ఉప్పు)పిచకారీ చేయాలన్నారు. దీనివల్ల రంగు మారకుండా ముఖ్యంగా మొలకెత్తకుండా నివారిస్తుందన్నారు. ఇప్పటికే కోసిన వరిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు.

## 2న ఈశ్వరుని గుడి గుత్త ఆస్తుల లీజు వేలం

పలమనేరు, నవంబర్ 29, ప్రభాతవార్త:

పలమనేరులో వెలసిన కాశీవిశ్వేశ్వరస్వామి గుడికి చెందిన గుత్త ఆస్తుల వేలం పాటలు డిసెంబర్ 2న ఉదయం 10 గంటలకు స్థానిక గుడి ఆవరణలో జరుగుతుందని ఆలయ ఇఒ, చైర్మన్ పాలక మండలి ఓ ప్రకటనలో తెలిపారు. పలమనేరు టౌన్‌లోని సర్వే నెంబరు 467లో విస్తీర్ణం 16 సెంట్లు ఖాళీ స్థలానికి 11 ఏళ్ళకు బహిరంగ వేలం పాట ఉంటుందన్నారు. పాల్గొన దలచిన వారు రూ. 1 లక్ష డిపాజిట్ చెల్లించాలని, హెచ్చు పాటదారుడుకి లీజు వర్తిస్తుందని తెలిపారు. దేవస్థానం కార్యనిర్వహణాధికారి వారి కార్యాలయంలో టెండరు బాక్సులో డిసెంబర్ 2న ఉదయం 10 గంటలలోపు షీల్డు టెండరు వేయాలని సూచించారు. అలాగే మిగిలిన రెండు సెంట్లు స్థలంలో గల మూడు అంగడి రూములకు మూడు సంవత్సరాలకు వేలం పాటలు ఉంటాయని ఇందుకు రూ.25 వేలుడిపాజిట్ చెల్లించి వేలం పాటలో పాల్గొనవచ్చని ఊచించారు. దేవాదాయ శాఖ ఉప కమీషర్ కర్నూలు వారి సమక్షంలో ఈ వేలం పాటలు ఉంటాయని మిగిలిన షరతులు వేలం పాటల సమయంలో వివరిస్తామని తెలిపారు.

## కరిడి మడుగులో పోలీసుల పల్లెనిద్ర

పలమనేరు, నవంబర్ 29, ప్రభాతవార్త:

పలమనేరు రూరల్ మండలం కరిడిమడుగులో శుక్రవారం రాత్రి పలమనేరు పోలీసులు పల్లె నిద్ర నిర్వహించారు. అర్బన్ సిఐ మురళీమోహన్ సిబ్బందితో కలిసి కరిడిమడుగు గ్రామం సందర్శించారు. గ్రామస్తులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అలాగే సైబర్ నేరాలు, రాత్రిళ్ళలో చోరీలు గురించి వివరించారు. ఎస్ఐ స్వర్ణతేజ సిబ్బంది పాల్గొన్నారు.

## రసాభాసాగా మున్సిపల్ సమావేశం

2026-27 బడ్జెట్ ఆమోదం

పలమనేరు, నవంబర్ 19, ప్రభాతవార్త:

పలమనేరు మున్సిపల్ పాలకవర్గ సమావేశం రసాభాసాగా జరిగింది. శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో జరిగిన సమావేశానికి చైర్మన్ చాముండేశ్వరి అధ్యక్షత వహించారు. మున్సిపల్ కమీషనర్ ఎంవి రమణారెడ్డి ప్రారంభించారు. ప్రారంభంలోనే ఈ నెల 25న జరిగిన సమావేశం వాయిదా వేయాలని చైర్మన్ సూచించినా కావాలనే నిర్వహించారని వైసిపి కౌన్సిలర్లు నిలదీశారు. దీనిపై కమీషనర్ మాట్లాడుతూ ఆ రోజు సమావేశం ఏర్పాటు చేసిన విషయం వాస్తవమేనని ఐతే కోరంలేక వాయిదా వేశామని వివరించారు. ఈ సందర్భంగా 2026-27 కు రూ.7.97 కోట్లతో మున్సిపల్ బడ్జెట్‌కు ప్రతిపాదించగా సభ్యులు ఆమోదం తెలిపారు. గతంలో 2025-26కు కేటాయించిన బడ్జెట్‌ను అవగాహన రాహిత్యంతో పూర్తి స్థాయి వినియోగించలేదని వైసిపి కౌన్సిలర్లు ఆరోపించారు. మున్సిపల్ ఆస్థుల ఆక్రమణలపై నిలదీశారు. ఎక్కడ బడితే అక్కడ కబ్జాకు గురవుతున్న మున్సిపల్ ఆస్తులు కాపాడాలని విజ్ఞప్తి చేశారు.

## 30న పలమనేరు తాలూకా ఎన్జీఓ సంఘం ఎన్నిక

పలమనేరు, నవంబర్ 29, ప్రభాతవార్త:

పలమనేరు తాలూకా గెజిటెడ్,నాన్‌గెజిటెడ్ ఆఫీసర్ల అసోసియేషన్ ఎన్జీఒల సంఘం ఎన్నిక ఈ నెల 30న ఉంటుందని జిల్లా అధ్యక్షుడు కెవి రాఘవులు తెలిపారు. ఈ ఎన్నిక నిర్వహించడానికి ఎన్నికల అధికారిగా రహ్మత్ ఆలీఖాన్, సహాయ ఎన్నికల అధికారిగా సురేష్ బాబు, పరిశీలకులుగా జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు వ్యవహరిస్తారని తెలిపారు. సంఘం సభ్యత్వం పొందిన పలమనేరు తాలూకా పరిధిలోని పలమనేరు మున్సిపాల్టీ, పలమనేరు రూరల్, గంగవరం, బైరెడ్డిపల్లె, వి.కోట మండలాలకు చెందిన ఉద్యోగులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## కాంగ్రెస్‌కు పూర్వ వైభవం తెద్దాం



ఇన్చార్జ్ మురళీమోహన్ యాదవ్

పుంగనూరు నవంబర్ 29 ప్రభాతవార్త

కాంగ్రెస్ పార్టీకి పట్టుకొమ్మ అయినా నియోజకవర్గంలో పార్టీకి పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు సమిష్టిగా కృషి చేద్దామని పార్టీ ఇంచార్జ్ మురళీమోహన్ యాదవ్ అన్నారు. పట్టణంలో శనివారం మధ్యాహ్నం కాంగ్రెస్ పార్టీ ఏఐసీసీ అబ్జర్వర్ మహేంద్రన్ సారథ్యంలో పార్టీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ రానున్న సంస్థ గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రతి స్థానం నుంచి పోటీ చేస్తుందన్నారు. స్థానిక సంస్థ ఎన్నికల్లో ప్రతి స్థానం నుంచి కాంగ్రెస్ పార్టీ పోటీ చేస్తుందని అన్నారు. ఎందరో నాయకులకు రాజకీయ బిక్ష పెట్టిన కాంగ్రెస్ పార్టీ పుంగనూరులో చరిత్ర సృష్టించిందన్నారు. ఇక్కడ పార్టీకి మళ్ళీ వైభవం తీసుకురావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు గాజుల భాస్కర్,పట్టణ అధ్యక్షుడు అయూబ్ భాష, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సమస్య తీవ్రమైతే పవన్ కళ్యాణ్ వరకు

సిరివేలు చిన్నా రాయల్

పుంగనూరు నవంబర్ 29 ప్రభాతవార్త



ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు ప్రతి నియోజకవర్గ కేంద్రంలో జనవాణి కార్యక్రమాన్ని జనసేన నిర్వహిస్తుందని, సమస్య తీవ్రమైతే పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ వరకు తీసుకు వెళ్ళేందుకు కూడా వెనకాల బోమని పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ చిన్నా రాయల్ అన్నారు. శనివారం ఉదయం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో జనవాణి ప్రధాన పరిష్కార వేదికగా మారుతుందని అన్నారు. నియోజకవర్గ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రకటించారు. ఈ కార్యక్రమం పార్టీ ఆదేశాల ప్రకారం నిర్వహించబడును. ఈ కార్యక్రమంలో పార్టీలో నియమితులైన నాయకులు మరియు లీగల్ సెల్ వారు పాల్గొంటారనీ, ప్రజలు వారి సమస్యలను తెలియజేస్తే కూటమి ప్రభుత్వం తరపున జనసేన వాటిని పరిష్కార మార్గాన్ని చూపిస్తూ ప్రతి సమస్యను కేంద్ర కార్యాలయానికి నివేదిస్తామని తెలియజేశారు.

## తుఫాను కారణంగా వరి పంటను కోయవద్దు

సదుం నవంబర్ 29 ప్రభాతవా ర్త

దిత్వా తుఫాను కారణంగా రాబోయే 2 రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందనీ వరి పంటను కోత కోయవద్దని సదం మండల వ్యవసాయ అధికారి జ్యోతి అన్నారు. శనివారం ఆమె మాట్లాడుతూ రైతులు వర్షపు నీటిని పంట పొలములో నుండి బయటకు వెల్లెలాగ ముందుగానే పొలము గట్లును కొంత మేర కట్ చేసి వుంచవలెనని చెప్పారు.తద్వారా పంట పొలం నుండి నిలిచి ఉన్న నీటిని బయటకు పంపగలమని పంట నష్టాన్ని నివారించవచ్చుననీ అన్నారు. నీటిలో మునిగిన వరి కోసం, ధాన్యాలు మొలకెత్తకుండా కాపాడటానికి, అదనపు నీటిని తీసివేసిన తర్వాత 5 సాధారణ ఉప్పు ద్రావణాన్ని (ఒక లీటరు నీటిలో 50 గ్రాముల సాధారణ ఉప్పు) చల్లుకోవాలని ఇది ధాన్యం మొలకెత్తకుండా మరియు ధాన్యం రంగు మారకుండా నిరోధిస్తుందని చెప్పారు. ఇప్పటికే కోసిన వరిని సురక్షిత ప్రదేశాలకు తరలించాలనీ దిత్వా తుఫాను వర్షాలు తగ్గే వరకు వరి పంటను కోయవద్దని చెప్పారు.

## వైసీపీ అవినీతి అక్రమాల చిట్టా నా దగ్గర ఉంది



**తిరుపతి విద్య నవంబర్ 29 ప్రభాత వార్త:** గత రెండు రోజులుగా వైసీపీ సొంత పత్రిక లో జనసేన నాయకులపై రాస్తున్నటువంటి తప్పుడుకథనాలను ఖండిస్తూ శనివారం తిరుపతి జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఎస్ బి, డి ఎస్ పి కి జనసేన నాయకులు ఫిర్యాదు చేసారు.కూటమి నాయకులలో ఎవరైనా తప్పు చేసినట్లు మీకు ఫిర్యాదులు అందితే వారి పై చర్యలు తీసుకోవాలని,అదేవిధంగా మా పై తప్పుడు కథనాలు ప్రచురించే సాక్షి పేపర్ పై కూడా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆ పార్టీ నేతలతో కలసి రాజా రెడ్డి పోలీసు అధికారులకు ఫిర్యాదు చేశారు.అనంతరం రాజా రెడ్డి మీడియాతో మాట్లాడుతూ గతంలో ఇలాంటి అసత్య ప్రచారాలు చేసినందువలనే వైసీపీ 11 సీట్లకు పరిమితం అయ్యిందని గుర్తు చేశారు.తిరుపతి నగరంలో భూ కబ్జాలకు పాల్పడింది ఎవరో ప్రజలకు తెలుసునన్నారు.గత ప్రభుత్వంలో అక్రమంగా వైసీపీ నాయకులకు ఎన్ని ఇళ్ళ స్థలాలు, ఎక్కడెక్కడ ఎన్ని బిల్డింగ్ లను సంపాదించారో వాటికి సంబంధించిన అన్ని ఆధారాలతో నిరూపిస్తానని,నా సవాల్ ను స్వీకరిస్తారా అని రాజా రెడ్డి వైసీపీ నేతలపై మండి పడ్డారు. గత ప్రభుత్వంలో మాజీ ఎమ్మెల్యే అతని కుమారుడు,వైసీపీ కార్పొరేటర్ లు ప్రభుత్వ భూములను కాజేసిన వివరాలు,అక్రమ సంపాదన వివరాలు సాక్షాదారాలతో సహా నా దగ్గర ఉన్నాయని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.తిరుపతిలో కొందరు వైసీపీ నేతలు ఓర్వలేక వారి సొంత పత్రికను అడ్డం పెట్టుకొని మాపై తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని, ఇలాంటి చర్యలకు పాల్పడితే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో.. జనసేన పార్టీ తిరుపతి నగర అధ్యక్షుడు,నేతలు రాజా రెడ్డి, బాబ్జి,హేమ కుమార్,సుభాషిణి, మధులత,సుమన్ బాబు,దినేష్ జైన్, మునుస్వామి,కిషోర్, రాజేష్ ఆచారి, వెంకటేష్,బాలాజీ, పురుషోత్తం,శ్రావణ్, వంశీ,అయ్యప్ప,ఆలీ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్.పి.డబ్ల్యూ. పాలిటెక్నిక్ కళాశాలలో శ్రీ కృష్ణ గీత వైభవ్ మహోత్సవం కార్యక్రమం



**తిరుపతి విద్య, నవంబర్ 29 ప్రభాత వార్త:** ఎస్.పి.డబ్ల్యూ. పాలిటెక్నిక్ కళాశాలలో ప్రిన్సిపాల్ డా.పద్మావతమ్మ స్వయంగా ముందడుగు వేసి,డివైన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు లో భాగంగా ఒక ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని నిర్వహించారు.డా.సి. రాంబాబు,కవిత,పావని సహకారంతో ఈ కార్యక్రమం విజయవంతంగా పూర్తి జరిగింది.హిందూ ఆధ్యాత్మిక విలువలను యువతలో పెంపొందించడంలో ఇటువంటి కార్యక్రమాలకు మద్దతు ఇ వ్వడం మా సంస్థకు ఒక గౌరవం.డిసెంబర్ 1వ తేదీ జరుపుకునే భగవద్గీత జయంతి పురస్కరించుకుని, విద్యార్థులు భగవద్గీత శ్లోకాలను పారాయణం చేశారు.యువతలో ధర్మబోధ,నైతిక విలువలు,సత్సంకల్పాలను పెంపొందించడమే ఈ కార్యక్రమం యొక్క ముఖ్య లక్ష్యం.ఈ సందర్భంగా డా.పద్మావతమ్మ విద్యార్థులను ఉద్దేశించి మన పవిత్ర గ్రంథమైన భగవద్గీత యొక్క ప్రాముఖ్యతను వివరించారు.గీత ఉపదేశాలు ప్రతిదినం జీవితంలో మార్గనిర్దేశం ఎలా చేస్తాయో చెప్పారు. అలాగే ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించేందుకు పూర్తి సహకారం అందించిన తిరుమల తిరుపతి దేవస్థానం యాజమాన్యం కి, దేవస్థానం ఎడ్యుకేషనల్ ఆఫీసర్ కి,బోధనా, బోధనేతర సిబ్బందికి కళాశాల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## పాఠశాలలు ఆకస్మిక తనిఖీ



**వడమాలపేట, నవంబరు 29 ప్రభాతవార్త:** జిల్లా అడిషనల్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ గౌరీశంకరరావు శని వారం వడమాలపేట మండలంలోని పాఠశాలలను ఆక స్మికంగా తనిఖీ చేశారు. టీసీ అగ్రహారంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలను ఆయన ఆకస్మి కంగా సందర్శించారు. పాఠశాల విద్యార్థుల హాజరు, ఉపాధ్యాయుల హాజరు పరిశీ లించారు. విద్యార్థు లకు ఆసక్తికరమైనటువంటి అంశాలపై చర్చించారు. 6,7,8 తరగతి విద్యార్థులతో ఆయన మాట్లాడుతూ వారికి అవసరమైనటువంటి గ్రంథాలయ పుస్తకాలపై సమీక్ష చేశారు. విద్యార్థులు నీతి కథలు, నీతి చంద్రిక రామాయణం, మహా భారతం, భాగవతం, శాస్త్రీయ పరిశోధనలు శాస్త్రజ్ఞుల కథల పుస్తకాలు, వివిధ ప్రతిభావంతుల జీవిత చరిత్రలు, దేశ రాజకీయ విషయాలకు సంబంధించిన అం శాలతో కూడిన పుస్తకాలు కావాలని కోరారు. అదే విధంగా ఉపాధ్యాయులతో సమీక్ష సమావేశం నిర్వ హించి అన్ని వివరాలు అడిగి తెలుసుకున్నారు. సమగ్రశిక్ష సెక్టోరల్ అధికారి కె.డి.సారథి, సీఆర్పీలు పాల్గొన్నారు.

## రైతులకు పెద్దపీట వేస్తున్న కూటమి ప్రభుత్వం...



**రేణిగుంట నవంబర్ 29 ప్రభాతవార్త.** తెలుగుదేశ కూటమి ప్రభుత్వం రైతులకు పెద్దపీట వేస్తున్నదని శ్రీకాళహస్తి నియోజకవర్గం ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి అన్నారు. రేణిగుంట మండలం ఆర్ మల్లవరం గ్రామంలో శనివారం ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతన్న మీకోసం కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి రైతుల ఇంటింటికి తిరిగి వారి బాగోగులను తెలుసుకొని రైతుల కోసం ప్రభుత్వం చేపట్టిన రైతన్న మీకోసం పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసిల్దార్ శ్యాంప్రసాద్, ఏపీ ఎస్పీడీసీఎల్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రమేష్ బాబు, రేణిగుంట అర్బన్ సీఐ జయచంద్ర, వివిధ శాఖల అధికారులతో పాటు తిరుపతి పార్లమెంటరీ టిడిపి ఉపాధ్యక్షుడు చెర్లోపల్లి సుబ్రమణ్యం రెడ్డి, రేణిగుంట పట్టణ టిడిపి అధ్యక్షుడు మహబూబ్ బాషా, జిల్లా రైతు సంఘం నాయకులు మునిస్వామి నాయుడు, కరకంబాడి క్లస్టర్ ఇంచార్జ్ బుజ్జి నాయుడు, శ్రీ కట్ట పుట్టలమ్మ దేవస్థానం చైర్మన్ పాడి రాజేంద్ర, అడ్వకేట్ ఉదయ్ కుమార్ రెడ్డి, టిడిపి సీనియర్ నాయకులు నెల్లూరు సుబ్రహ్మణ్యం, అన్నాసంపల్లి నాదమున్ రెడ్డి, వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ చిన్నారెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ గజేంద్రయ్య, స్థానిక టిడిపి నేతలు సీతారామరెడ్డి, ఈశ్వర్ రెడ్డి, గురువారెడ్డి, కిరణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు...

## పరామర్శలు పలకరింపులు:



**శ్రీకాళహస్తిరూరల్,నవంబర్ 29 ప్రభాతవార్త** శ్రీకాళ హస్తి నియోజకవర్గంలోని శ్రీకాళహస్తి,ఏర్పేడు మండ లాల్లో శనివారం మాజీ శాసనసభ్యుడు బియ్యపు మధు సూధనరెడ్డి విస్తృతంగా పర్యటించారు. శ్రీకాళహస్తి మండలం వైయస్ఆర్ పార్టీ నాయకుడు చెవిరెడ్డి మధుసూధనరెడ్డి మాతృమూర్తి జయమ్మ హత్యకు గురైనవిషయం విదితమే.వారి కుటుంబాన్ని పరామర్శిం చారు. అదేవిధంగా ఏర్పేడు మండలం అంజిమేడు గ్రామంలో మృతి చెందిన కన్నలి అమర్నాథ్రెడ్డి కుటుంబాన్ని పరామర్శించారు. ఆయనతో పాటు నియోజకవర్గ పరిశీలకులు ఓడూరు గిరిధర్రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు బర్రె సుదర్శనం రెడ్డి టి.మోహన్రెడ్డి, చెవిరెడ్డి నారాయణ రెడ్డి, భాస్కర్రెడ్డి, శంకర్రెడ్డి వెంకటాద్రి,బాలాజిలు ఉన్నారు.

## శివయ్య సేవలో రాష్ట్ర జంగమ కార్పొరేషన్ చైర్మెన్



**శ్రీకాళహస్తి, నవంబర్ 29 ప్రభాతవార్త** రాష్ట్ర జంగమ సంక్షేమ సంఘం కార్పొరేషన్ చైర్మెన్ వాసునూరు చంద్రశేఖర్ శుక్రవారం శ్రీకాళహస్తీశ్వరుని దర్శిం చుకొని పూజలు జరుపుకున్నారు. వారు కుటుంబ సభ్యులతోరాగా వారికి ఆలయ వద్ద శ్రీకాళహస్తి జంగ మ సంఘం పెద్దలు ఘనస్వాగతం పలికారు. ఆలయంలోని స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనం చేసుకున్న వారికి మృత్యుంజయస్వామి ఆలయం వద్ద వేదపండితులతో ప్రత్యేకాశీర్వచనాలు అందించారు. స్వాగతం చెప్పిన వారిలో కులపెద్దలు మాజీ కౌన్సిలర్ రవీంద్రబాబు, సుబ్రమణ్యం,లోకేష్, త్యాగమూర్తి, శ్రీ లక్ష్మీ,ముత్యాలయ్య,శంకరయ్య,బాలాజి,మనోజ్సాయి,చంద్రమౌళి,హేమకుమార్లుస్వాగతం పలికారు.

## ఒక కుటుంబానికి ఒక పట్టా:రాజీవ్నగర్లో సర్వే పూర్తి చేయండి:

**శ్రీకాళహస్తి,నవంబర్ 29 ప్రభాతవార్త** శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని రాజీవ్న గర్లో చేపట్టిన సర్వే పనులు సత్వరంగా పూర్తి చేసి ఒక కుటుంబానికి ఒక పట్టా ఉండేటట్లు చర్యలు తీసుకోవాలని శాసనసభ్యుడు బొజ్జల సుధీర్రెడ్డి అధికారులకు ఆదేశించారు.రాజీవ్నగర్ అక్రమాలకు నిలయంగా మారిందనే విమర్శలు న్నాయి. ఈ నెల 6 నుంచి ప్రారంభం అయిన సమగ్ర సర్వేను మరో 15రోజుల లోపల పూర్తి చేయాలని ఎంఎల్ఏ రెవెన్యూ అధికారులకు ఆదేశించారు.రాజీవ్నగర్లో 2009 నుంచి పట్టాల వివాదం కొనసాగుతుంది. 2019 నుంచి 2024 వరకు రాజీవ్నగర్ లో కొందరు అధికార పార్టీ నాయకుల మద్దతుతో విచ్చల విడిగా పట్టాల విక్రయాలు సాగాయి. అంతేకాక ఇక్కడ, పక్కనే జగనన్న కాలనీల్లో అనధికారిక పట్టాలు జారి అయ్యాయనే విమర్శలు చోటు చేసుకున్నాయి. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత శాసనసభ్యుడు సుధీర్రెడ్డి అక్రమ పట్టాలపై దృష్టి సారించారు. రెండు సార్లు సర్వేలు జరిపించారు. ప్రస్తుతం మూడవ సారి సమగ్ర సర్వే జరుపుతున్నారు. ఇక్కడ సామాజిక కార్యక్రమాలకు కేటాయించిన స్థలాల్లో కూడా అక్రమ కట్టడాలు సాగాయి. ఇక్కడ ఆలయాలు, పార్కులు,రోడ్డు స్థలాలు అక్రమణలకు గురయ్యాయి.ఈ నేపథ్యంలో ఈ నెల 31నాటికి సర్వే పూర్తి చేయాలని సూచించారు. నెల రోజులుగా సాగుతున్న సర్వేలపై సుధీర్రెడ్డి శ్రీకాళహస్తి తహశీల్దార్ జనార్థన్రాజుతో సమీక్షించారు. వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇక సర్వే పూర్తి చేసి సంక్రాంతికి అర్హులైన ప్రతి నిరుపేదకు పట్టాలివ్వటానికి సిద్ధం చేయాలని సూచించారు.

## అభివృద్ధికి బ్రాండ్ అంబాసిడర్ బొజ్జల



**తొట్టంబేడు, నవంబర్ 29 ప్రభాతవార్త** రాష్ట్రాభి వృద్ధికి బ్రాండ్ అంబాసిడర్ రాష్ట్రంలో చంద్రన్న, శ్రీకాళ హస్తి నియోజకవర్గంలో సుధీరన్న అని మండల పార్టీ అధ్యక్షుడు రావిళ్ళ మునిరాజా నాయు డు అన్నారు. శనివారం మండలంలోని పెన్నల పాడు పంచాయతీలో అన్నదాత సుఖీభవ కార్యక్రమాలను నిర్వహిం చారు.ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత రాష్ట్రంలో అమలు జరుగుతున్న పథకాలకు సంబంధించి అలాగే నియోజకవర్గంలో శాసనసభ్యుడు సుధీర్రెడ్డి ఆచరిస్తున్న అభివృద్ధి పాలన గురించి ఇంటింటికి వెళ్ళి వివరించారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు సూపర్ సిక్స్ పథకాలను ప్రకటించారని ఒక్కొక్కటి అమలు చేసుకుంటూ ఇవ్వని హామీలకు నిధులు కేటాయిస్తూ ముందుకు సాగుతున్నారనివివరించారు. రైతులకుఎకరాకు మూడుబస్తాలయూరియాను అందిస్తున్నారని మండలం లోని ప్రతి రైతుకు యూరియా అందేటట్లు చర్యలు తీసుకుంటున్నట్లు మునిరాజానాయుడు వివరించారు. ఈ కార్యక్రమాల్లో ఆయకట్టు చైర్మెన్ వరదరాజులు నాయుడు, చెంచయ్య,సుబ్రమణ్యం ఆచారి, బాలరాజు, చలపతి తదితరులు పాల్గొన్నారు.

## వినియోగదారుల రక్షణ చట్టాన్ని సద్వినియోగంచేసుకోవాలి



**తిరుపతి,నవంబర్ 29ప్రభాతవార్త:** జిల్లా వినియోగదారుల సమాచార కేంద్రం కన్వీనర్ పి.రాజారెడ్డి శనివారం జిల్లా సంయు క్తకలెక్టర్ మౌర్యను మర్యాదపూర్వకంగా కలిశారు. వినియోగ దారుల రక్షణ చట్టాన్ని ప్రజలు సద్వినియోగం చేసు కునేలా జిల్లా అధికారులు చూడాలని, అవగాహన కల్పించేలా సహకారం అందించాలని కోరారు. మేలుకో వినియోగదారుడా మేలుకో నీహ క్కుల్ని తెలుసుకో పుస్తకాన్ని అందజేశారు. ప్రజలను చైతన్య వంతంచేయడంలోజిల్లా వినియోగదారుల కేంద్రం ఒక సామాజిక బాధ్యతగా కృషిచేయాలని సూచించారు.

## దశసహస్రసువాసిని పూజకు విచ్చేయండి



**తిరుపతి,నవంబర్ 29ప్రభాతవార్త:** తిరుపతి సమీపం లోని రాయల్చెరువులో వెలసిన శ్రీ శక్తిపీఠంలో చేపట్టే దశసహస్రసువాసిని పూజకు విచ్చేయాలని తుడ ఛైర్మన్ సి.దివాకర్రెడ్డికి పీఠం నిర్వాహకులు ఆహ్వానిం చారు. శనివారం పీఠం నిర్వాహకులు ఆయనను కలసి ఈ ఆహ్వానపత్రికను అందజేశారు. దేశంలోనే మొట్టమొదటిసారిగా శ్రీశక్తిపీఠంలో రమ్యానందభా తిస్వామి ఆధ్వర్యంలో పదివేలమందితో సువాసినల ప్రత్యక్షపూజ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పీఠం అర్చకులు ఆశీర్వచనం చేశారు.

## తిరుపతి ఆర్టీసి డిపోకు ఆస్టర్ నారాయణాద్రి వితరణ



**తిరుపతిరవాణ,నవంబర్ 29ప్రభాతవార్త:** ఆర్టీసి బస్సుల్లో అవసరమైన ప్రథమచికిత్స పెట్టెలు(ఫస్ట్ ఎయిడ్ కిట్)వందవాటిని ఆస్టర్ నారాయణాద్రి ఆస్పత్రి యాజమాన్యం వితరణ చేసింది. శనివారం ఉదయం ఆస్పత్రి యాజమాన్యం ఆర్టీసి బస్సుల్లో అవసరమైన ప్రధమ చికిత్స కిట్ల బాక్సులను తిరుపతి డిపో మేనేజర్ సురేంద్రకుమార్,ఆర్టీసి ప్రాంతీయ వైద్యశాల డాక్టర్ గుణమాదురికి అందజేశారు. అత్యవసర సమయంలో వాటిని వినియోగించుకునేందుకు అవసరమైన మందులు ఉంటాయి.

## పీరమల్ ఫైనాన్స్ విస్తరణ



**తిరుపతి,నవంబర్ 29ప్రభాతవార్త:** సామాన్యమధ్య తరగతివర్గాల ప్రజల అవసరాలకు అందుబాటులో రుణసాయం అందించేందుకువీలుగా పీరమల్ ఫైనా న్స్ లిమిటెడ్ రాష్ట్రంలో శాఖల విస్తరణ చేపట్టింది. రానున్న రెండేళ్ళలో 1.5లక్షలు కోట్లరూపాయలతో ఎయుఎం సాధించాలని లక్ష్యంగా నిర్దేశించింది. గృహరుణాలు, ఎంఎస్ఎంఈ ఉత్పత్తుల కోసం ముఖ్యమైన మార్కెట్గా కొనసాగనుంది. 38వేలమందికిపైగా వినియోగదారులకు సేవలందిస్తున్న 30శాఖలు సహా రాష్ట్రంలో తిరుపతిలోనూ త్వరలో విస్తరించనుంది. ఎంఎస్ఎంఇల రుణాల కోసం డిమాండ్ను గుర్తించి సేవలందించనుంది. మధ్యతరగతి కుటుంబాలు, చిన్నవ్యాపారుల కోసం రుణాల మంజూరుకు సులభంకానుంది. పారదర్శకమైన నమ్మదగిన క్రెడిట్ పరిష్కారాలను అందించడం పీరల్ లక్ష్యమని సిఈఓ జగదీప్మల్లారెడ్డి, చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ అరవింద్అయ్యర్ తెలిపారు.

## దిత్వ " తుఫాన్తో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : తహసిల్దార్

**పాకాల, నవంబరు 29ప్రభాతవార్త:** 'దిత్వ " తుఫాను రాబోయే నాలుగు రోజులు మండలంపై ప్రభావం చూపుతుందని వాతావరణ శాఖ సూచించిన నేపథ్యంలో,దిత్వ తుఫాను పట్ల వీఆర్వోలు, వీఆర్ఏ గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు కాలువల్లో చెత్త పేరుకుపోకూడదు.. వర్షపు నీరు నిలిచిపోకూడదు, సిబ్బంది 24 గంటలు గ్రామాల్లో తిరుగుతూ ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ఇరిగేషన్ అధికారులు మేజర్ - మైనర్ చెరువులు ప్రమాదాలకు గురికాకుండా అప్రమత్తంగా ఉండాలని కోరారు . రైతులకు ముందస్తు హెచ్చరిక నీటమునిగే అవకాశమున్న పంటలను వెంటనే గుర్తించాలి. అలాంటి ప్రాంతాల్లో వ్యవసాయ శాఖే రైతులకు మార్గనిర్దేశం చేయాలని తహసీల్దార్ ఆదేశించారు. పశువులను కూడా నిర్లక్ష్యం చేయొద్దు, పిడుగుపాటు ప్రమాదం ఉన్నందున పాడిరైతులు తక్షణ రక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామాల్లో అప్రమత్తత పెంచేందుకు టాంటాం ప్రచారం తప్పనిసరి అని రెవెన్యూ సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. తహసీల్దార్ కార్యాలయంలో అధికారులు అందుబాటులో ఉంటారని ఎలాంటి పరిస్థితులైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఆయన స్పష్టంచేశారు. కంట్రోల్ రూమ్ నెంబర్ 9492712100 లో సంప్రదించాలి అని తెలియజేసారు.

## మండలంలోని ప్రభుత్వ ఉపాధ్యాయులకు క్రీడా పోటీలు



**పుత్తూరురూరల్, నవంబరు 29 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వ విద్యాశాఖ అధికారుల ఆదేశాల మేరకు శనివారం పుత్తూరు మండలంలోని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు వివిధ ఆటల పోటీలు ఎంఈవోలు ఆధ్వర్యంలో నిర్వహించారు. పురుష ఉపాధ్యాయులకు క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఈ క్రీడా పోటీలు ఉపాధ్యాయులకు మానసిక ఉల్లాసం, శారీరక దృఢత్వం పెంపొందించుకోవడానికి క్రీడలు దోహదపడతాయని పుత్తూరు మండల ఎంఈవో-2 బాలసుబ్రహ్మణ్యం తెలిపారు. ఈ పోటీల్లో మండలంలోని ఉపాధ్యాయులు పాల్గొనడం అభినందనీయమన్నారు. ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా ఉపాధ్యాయుల్లో ఐక్యత భావం, వృత్తి పట్ల ఆరోగ్యకరమైన పోటీతత్వం ఏర్పడుతుందని విద్యార్థులకు క్రీడల పట్ల అవగాహన కల్పించాలని తెలిపారు. డివిజనల్, జిల్లా స్థాయిలో పుత్తూరు మండలాన్ని విజేతగా నిలపాలని ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో పుత్తూరు మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులకు క్రికెట్, త్రో బాల్ పోటీలు



**సత్యవేడు, నవంబరు 29 ప్రభాతవార్త:** మండలం లోని ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యా యులకు క్రికెట్, త్రోబాల్ పోటీలను మండల విద్యా శాఖ అధికారులు నిర్వహించారు. శనివారం స్థానిక బాలుర, బాలికల క్రీడా మైదానంలో ఎంఈవో రవి ఆధ్వర్యంలో పోటీలు జరిగాయి. ఇందులో పురుష ఉపాధ్యాయులకు క్రికెట్, మహిళా ఉపాధ్యాయులకు త్రోబాల్ పోటీలను నిర్వహించారు. ఈ నేపథ్యంలో క్రికెట్ పోటీల్లో అత్యధికపరుగులు సాధించి ప్రతిభకనరబచిన 16 మంది పురుష ఉపాధ్యాయులను ఎంపిక చేశారు. ఇందులో ఉపాధ్యాయులు నలుగురు, బౌలర్స్ నలుగురు, ఆల్ రౌండర్స్ నలుగురు, ఆఫ్ స్పినర్స్ ఒకటి, లెగ్ స్పిన్నర్ ఒకటి, వికెట్ కీపర్ ఇద్దరు ఉన్నట్టు ఈ సందర్భంగా ఎంఈవో రవి తెలిపారు. అలాగే త్రోబాల్ పోటీల్లో ప్రతిభకనబరచిన మహిళా ఉపాధ్యాయులు 12 మందిని ఎంపిక చేయడం జరిగిందన్నారు. ఈ పోటీల్లో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు హాజరయ్యారు. ప్రతిభ ఆధారంగా ఎంపికైన వీరు డివిజన్ స్థాయి పోటీలకు హాజరవుతారని ఆయన తెలిపారు.

## ప్రతి హృదయాన్ని కదిలించే చిత్రం స్కూల్ లైఫ్



**తిరుపతి విద్య, నవంబర్ 29 ప్రభాత వార్త:** ప్రతి ఒక్కరి జీవన పయనంలో పాఠశాల జీవితం ఒక అద్భుతమైనదని, పాఠశాలలో జీవితాలను ఆవిష్క రిస్తూ అద్భుత రీతిలో రూపొందించిన స్కూల్ లైఫ్ చిత్రం కదిరిస్తుందని ప్రతి హృదయాన్ని కదిలిస్తూ స్కూల్ జ్ఞాపకాలను జ్ఞప్తికి తెస్తుందని చిత్రం నటుడు నరేష్ జిట్ల తెలిపారు.ఈనెల 28న విడుదలైన స్కూల్ లైఫ్ చిత్రం నేపథ్యంలో చిత్రం యూనిట్ శనివారం తిరుపతిలోని మినీ ప్రతాప్ లో ప్రేక్షకులతో కలిసి చిత్ర యూనిట్ సభ్యులు తిలకించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కుటుంబ సమేతంగా చిత్రాన్ని తిలకించే రీతిలో ఈ సినిమా ఉంటుందని, ప్రతి ఒక్కరి జీవితంలో ఉండే స్కూల్ లైఫ్ ను నెమరు వేయించే చక్కటి కథ అంశంతో పులివెందుల మహేష్ అందించిన ఈ చిత్రాన్ని ప్రేక్షకులందరూ తిలకించి ఆదరించాలని ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సినీ డైరెక్టర్ శాన్వి సూర్య, నటుడు జయకృష్ణ పాల్గొన్నారు.

## యస్వీయూలో అన్వేషణ్ 2025 కార్యక్రమం



**తిరుపతి విద్య, నవంబర్ 29 ప్రభాత వార్త:** శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని స్టూడెంట్ వెల్ఫేర్ అండ్ కల్చర్ విభాగం ఆధ్వర్యంలో ఈ రోజు అన్వేషణ్2025 కార్యక్రమం విశ్వవిద్యాలయం ఉపకు లపతి ఆచార్య టాటా నర్సింగరావు, రెక్టార్ ఆచార్య అప్పారావు లాంఛనంగా ప్రారంభించారు. ఫార్మసీ, ఇంజనీరింగ్,హెల్త్ సైన్స్, న్యూట్రిషన్ రంగాల్లో వివిధ కళాశాలల విద్యార్థుల్లోని ప్రతిభను వెలికి తీయడానికి వివిధ పోటీలను నిర్వహించారు.ఈ పోటీల్లో మంచి సృజనాత్మక కనబరిచిన విద్యార్థులకు విశ్వ విద్యాలయం అధికారులు బహుమతులు అందజేశారు.డీన్లు ఆచార్య మురళీధర్, ఆచార్య నరసింహ, ఆచార్య చంద్రాయుడు, ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, కల్చరల్ కోఆర్డినేటర్ డాక్టర్ వివేక్ పాల్గొన్నారు.

## గోపాలకృష్ణాపురం ఎస్టీ కాలనీ సమస్యపై స్పందించిన తహసీల్దార్

**పుత్తూరు రూరల్, నవంబరు 29 ప్రభాతవార్త:** గోపాలకృష్ణాపురం ఎస్టీ కాలనీలోని తొరూరు లెక్కదాఖల సర్వే నెం.35/2 ఉన్న భూమిని కదిరివేలు మొదలియార్ ఆక్రమించుకున్నారని శుక్రవారం ధర్నా నిర్వహించడంతో స్పందించి శనివారం మధ్యాహ్నం నుంచి తహసీల్దార్, మండల సర్వే, వీఆర్వో ఆ గ్రామంలోని భూములను పరిశీలించారు. అక్కడున్న ఎస్టీ కాలనీకిచెందిన వారు పాల్గొని భూ సమస్యను వివరించారు. గత 35 సంవత్సరాలుగా మామిడి చెట్లు పెట్టి సాగు చేసుకుంటున్నామని తెలిపారు. దానికి తహసీల్దార్ స్పందించి ఉన్న రిపోర్టును కలెక్టర్కి పంపుతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు వెంకటేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## దిత్వా తుఫాన్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

-తిరుపతిరూరల్ తహశీల్దార్ కార్యాలయంలో కంట్రోల్రూమ్ ఏర్పాటు

-24గంటల పాటు నిఘా...షిప్ట్వారీగా సిబ్బందికి బాధ్యతలు

**తిరుపతిరూరల్, నవంబర్ 29 ప్రభాతవార్త:** దిత్వా తుఫాన్ ప్రభావంతో వచ్చే భారీ వర్షాలను దృష్టిలో ఉంచుకుని...జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తిరుపతిరూరల్ తహశీల్దార్ కార్యాలయంలో ప్రత్యేక కంట్రోల్ రూమ్ను ప్రారంభించినట్లు ఆర్ఎస్ టిడి మోహన్బాబు తెలిపారు. తుపాన్ సమయంలో ఎవరు చెరువులు, వాగులు, నీటిమీదగా వెళ్లే వంతెనలకు దగ్గరగా వెళ్లవద్దని సూచించారు. ఏ అత్యవసర సమస్య వచ్చినా వెంటనే కంట్రోల్రూమ్కు సమాచారం అందించాలని మండల అధికారులు సూచించారు. తుఫాన్ నేపథ్యంలో 24గంటల పాటు అప్రమత్తంగా ఉండేలా సిబ్బందిని షిప్టులవారీగా నియమించినట్లు తెలిపారు. కంట్రోల్రూమ్ల కార్యకలాపాలు ప్రారంభం-తిరుపతిరూరల్లోనే తొలి స్పందన తుఫాన్ పుణ్యమా అని ఏ క్షణాన అయిన భారీ వర్షాలు, గాలివానలు, వరదల పరిస్థితులు తలెత్తే అవకాశం ఉండడంతో మండల స్థాయిలో సిద్దం చేసిన సిబ్బంది, జాబితా ప్రకారం వెంటనే విధులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

గ్రామాల్లో విఆర్వో-విఆర్ఏలకు హై అలర్ట్ గ్రామాల్లో వరద ఉధృతి, ముంపు ప్రాంతాలలో నీటి మట్టం, చెరువుల్లో నీటి మట్టం, చెట్లు విరిగిపడటం వంటి అత్యవసర సమాచారాన్ని వెంటనే కంట్రోల్రూమ్కు చేరవేయాలని స్పష్టమైన ఆదేశాలు చేసారు. ఏ నిర్లక్ష్యం జరిగినా విపత్తు నిర్వాహణ చట్టం-2005 ప్రకారం కఠిన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు.

## డ్రగ్స్-మెడిసిన్లపై తగ్గిన జిఎస్టీ ప్రయోజనాలు వినియోగారులకు చేరాలి



**తిరుపతిరూరల్, నవంబర్ 29 ప్రభాతవార్త:** డ్రగ్స్-మిడిసిన్లపై తగ్గిన జిఎస్టీ ప్రయోజనాలు వినియోగదారులకు చేరాలనిరాష్ట్ర పన్నుల సంయుక్త కమిషనర్ రవీంద్రనాధ్ అన్నారు. శుక్రవారం తిరుపతి కమర్షియల్ టాక్స్ కాంప్లేక్స్లో డ్రగ్స్-మెడికల్స్ హోల్సెలర్లు, రిటైర్లు, డిస్ట్రిబ్యూటర్ల విస్తృత సమా వేశం జరిగింది. ఈ సమావేశంలో కమిషనర్ మాట్లాడుతూ ఇటీవల జిఎస్టీ రేటు తగ్గింపులను ప్రజలకు పారదర్శకంగా పాస్ అన్ చేయడం అన్ని డీలర్ల బాధ్యత అని స్పష్టం చేసారు. ప్రతి ఇన్వాయి స్లో తగ్గిన జిఎస్టీ రేటుతో వచ్చిన ప్రయోజనాన్ని స్పష్టంగా చూపించాలన్నారు. వినియోగదారుల ప్రయోజ నాలను హరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కంపోజిషన్ పన్ను చెల్లింపుదారులు రెగ్యులర్ కేటగిరికి మారాల్సిన అవసరం, ప్రొఫెషన్ ట్యాక్స్ చెల్లింపు, అవసరమైన రిజిస్ట్రేషన్ల పూర్తి, శాసనబద్ద రిటర్నులను సమాయానికి దాఖలు చేయడం వంటి అంశాలపై డీలర్లకు మార్గదర్శకాలు తెలియజేసారు. జిఎస్టీ 2.0 అమలు నేపథ్యంలో పన్ను చెల్లింపుదారులు పాలనాపరమైన నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని కోరారు.ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటరత్నం, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి సుబ్బరామ గుప్తా, ప్రతినిధులు నరసింహారెడ్డి, కుమార్,శశి,శివ,డ్రగ్స్-మెడికల్స్ డీలర్లు,తిరుపతిఅసిస్టెంట్కమిషనర్ ప్రసాద్రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## దిత్వా తుఫాన్తో గ్రామాల్లో ప్రత్యేక చర్యలు

న తహసీల్దార్ రోశయ్య, ఎంపీడీవో మాలతి గ్రామాల్లో పర్యటన

**కేవీబీ పురం, నవంబరు 29 ప్రభాతవార్త:** దిత్వా తుఫాన్ కోస్తా తీరం వెంబడి వస్తున్న భయంకర తుఫాన్కు రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ప్రజలకు సహాయ చర్యలను వాటి గురించి శనివారం తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయంలో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, సచివాలయ సిబ్బందులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లో తట్టు ప్రాంత ప్రజలు తుఫాన్ ప్రభావితానికి ముందస్తు చర్యల్లో భాగంగా అందరూ జాగ్రత్తగా ఉండాలని, ఏదైనా ఇబ్బందులు వస్తే వెంటనే తహసీల్దార్ కార్యాలయానికి ఫోన్ చేయాలని తుఫాన్ కాల్ సెంటర్ని కూడా ఏర్పాటు చేశామని తెలిపారు. ఎలాంటి ఇబ్బందులు వచ్చినా ఎదుర్కోవడానికి ప్రభుత్వం నుంచి సహాయ సహకారాలు అందించడానికి సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. ప్రతి పంచాయతీ కార్యదర్శి, వీఆర్వో, వీఆర్ఏలు గ్రామాల్లో వేచి ఉండి ప్రజలను అప్రమత్తంగా ఉండాలని ఆయన పలు సూచనలు అందించారు. సమావేశంలో వీఆర్వోలు, వీఆర్ఏలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## క్వారీ వద్దు...మా జీవితం కాపాడండి

- ఎగువపూడి ప్రజల వినతి, ఇదేనా అభివృద్ధి...ప్రజల ప్రాణాలపై క్వారీ నీడ

**కేవీబీ పురం, నవంబరు 29 ప్రభాతవార్త:** కేవీబీ పురం మండలంలోని ఎగువపూడి గ్రామ సమీపంలో ప్రతిపాదించిన నూతన క్వారీపై స్థానికులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. గ్రామ ప్రజల అభిప్రాయాన్ని పట్టించుకోకుండా అనుమతులు మంజూరు చేయడం తమపై మోపిన ప్రమాదమేనని ఐదు గ్రామాల ప్రజలు ఆవేదన చెందుతున్నారు. శనివారం ఎగువపూడి గ్రామస్తులు, మండల తెలుగు యువత కార్యదర్శి మనోహర్ ఆధ్వర్యంలో సత్యవేడు నియోజకవర్గ టీడీపీ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ శంకర్రెడ్డిని కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ గ్రామ ప్రజలకు తెలియ జేయకుండానే, ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టకుండానే క్వారీ అనుమతులు ఎలా జారీ చేస్తారో తెలియడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. క్వారీ వస్తే దుమ్ము, శబ్ధ కాలుష్యం, చెరువులు, బావులపై ప్రభావం పడడంతో మా జీవనోపాధి కోల్పోవడంతో పాటు భావితరాల భవిష్యత్తే చీకట్లోకి నెట్టబడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. రాజుల కండ్రిగతో పాటు ఐదు గ్రామాలపై ఈ క్వారీ తీవ్ర ప్రభావం చూపుతుందని ప్రజలు తెలిపారు. వెంటనే అనుమతులు రద్దు చేసి తమ గ్రామాల భద్రతను కాపాడాలని శంకర్రెడ్డిని కోరారు. సంబంధిత విషయంపై స్పందించిన శంకర్రెడ్డి సమస్యను పై స్థాయికి తీసుకెళ్లి తగిన చర్యలు తీసుకునేలా కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు గ్రామస్తులు తెలిపారు. కార్యక్రమంలో తిరుపతి పార్లమెంట్ రైతు అధ్యక్షుడు కనపర్తి గోపినాథ్రెడ్డి, బాలకృష్ణమరాజు, రాములు, మనోహర్, శాస్త్రిరాజు,నాగేష్,బాలాజీ, గిరిబాబు, శంకర్రాజు, చంద్రశేఖర్ రాజు, పశురాం తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణాన్నిరక్షణకు మొక్కలు నాటడమే - ఎంపీడీవో



**సత్యవేడు, నవంబరు 29 ప్రభాతవార్త:** పర్యావరణ సంరక్షణ కోసం స్వయం సహాయక సంఘం మహిళా సభ్యులు నడుం బిగించాలని సత్యవేడు ఎంపీడీవో చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో పర్యావరణ పరి రక్షణ, పచ్చదనం పెంపుదలపై డ్వాక్రా మహిళలకు, సంఘ మిత్రలకు జరిగిన శిక్షణ కార్యక్రమానికి ఆయన అధ్యక్షతవహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో మహి ళలు పట్టుకొమ్మ అన్నారు. స్వచ్ఛమైన వాయువు, వృక్షాలు, నిర్మలమైన నీటి వనరులు, సహజ ఖని జాలు, మృత్తికలు, లవణాలతో నిండిన సారవంతమైన భూమి కలిపి మానవ మనుగడకు అత్యంత ఉపయోగకరమైనవి పర్యావరణంగా పేర్కొనవచ్చునన్నారు. పైగా మానవళి సుఖ జీవనానికి ఇది చాలా ముఖ్యమన్నారు. అయితే కొన్ని శతాబ్ధాలుగా కొందరు వారి స్వార్థానికి ప్రకృతి వనరులను బలి చేస్తూ, పర్యావరణాన్ని కోలుకోలేని విధంగా దెబ్బతిస్తుండడం ఆందోళన కరమన్నారు. దీని ఫలితంగానే ప్రస్తుతం వాయు కాలుష్యం అధికమవుతున్న విషయాన్ని ఆయన ప్రస్తావించారు. డిప్యూటీ ఎంపీడీవో షణ్ముఖం మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షించడానికి ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. దీంతో పాటు పరిశుభ్రత కూడా ప్రాధాన్యతనిస్తూ చెట్లు పెంపకాన్ని ఒక ఉద్యమంలా తీసుకుపోవాలని ఆయన కోరారు. ఈ శిక్షణ కార్యక్రమంలో సత్యవేడు పంచాయతీ సెక్రటరీ ముని రవికుమార్, పలువురు సెక్రటరీలు, సంఘమిత్రలు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

## యోగాలో మాజీ సీఎం చేతుల మీదుగా పీహెచ్.డి అందుకున్న డి.సరిత



**తిరుపతి కలెక్టరేట్, నవంబర్ 29 ప్రభాత వార్త :** యోగా రంగంలో విశిష్టమైన పరిశోధన చేసిన డా. డి. సరితకు ఎఫెక్ట్ ఆఫ్ యోగ ఇంటర్ వెన్షన్ ఆన్ న్యూ నాటల్ అవుట్ కంస్ అనే తన పరిశోధనకు గాను పీహెచ్.డి పట్టాను కేంద్ర క్యాబినెట్ మంత్రి మధ్యప్రదేశ్ మాజీ సీఎం శివరాజ్ సింగ్ చౌహాన్ ప్రదానం చేశారు. ఈ పరిశోధనను డా. అఖిలేష్ సింగ్ కుమార్ పర్యవేక్షణలో శ్యామ్ గ్లోబల్ యూనివర్సిటీ లో పూర్తి చేశారు. నూతనజన శిశువుల ఆరోగ్యంపై యోగాభ్యాసాల ప్రభావాన్ని శాస్త్రీయంగా అధ్యయనం చేసిన ఈ పరిశోధనకు విశేషమైన గుర్తింపు లభించింది. ఇది డా. సరిత కు రెండవ పీహెచ్.డి. ఆమె మొదటి పీహెచ్.డి శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం లో రసాయన శాస్త్రంలో పూర్తి చేశారు. శాస్త్రం యోగా లో ద్వంద్వ పటిమ కలిగిన ఆమె, యోగా ద్వారా సమాజాన్ని ఆరోగ్యవంతంగా మార్చే దిశగా పనిచేయాలన్నది తన దృష్టి. ఈ సందర్భంగా మాట్లాడిన ఆమె,"నా లక్ష్యం యోగా ద్వారా ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించడం" అని పేర్కొన్నారు.

## తిరుపతి గొల్లవానిగుంటలో శాప్ చైర్మన్ రవినాయుడు ఆకస్మిక పర్యటన



**తిరుపతి క్రీడ, నవంబర్ 29, ప్రభాతవార్త** తిరుపతి గొల్లవానిగుంటలో నిర్మిస్తున్న క్రికెట్ స్టేడియం,పలు క్రీడా ప్రాంగణాలు పురోగతిని శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు శనివారం పరిశీలించారు.ఈ సందర్శన సందర్భంగా నిర్మాణ పనుల పురోగతిని ఆరా తీసిన చైర్మన్ రవినాయుడు, పనులను మరింత వేగవంతం చేసి, నిర్దిష్ట గడువులో నాణ్యతతో పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. త్వరితగతిన ఈ వసతులు క్రీడాకారులకు అందుబాటులోకి రావాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యాదవ్ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, గంగమ్మ తల్లి దేవస్థానం చైర్మన్ మహేష్ యాదవ్, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ తోట వాసుదేవ్, మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీధర్, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ డిఎస్డిఓ శశిధర్, వారి సిబ్బంది పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

## థీమ్5 క్లీన్ అండ్ గ్రీన్ విలేజ్‌పై శిక్షణ



వాకాడు, నవంబర్ 29 ప్రభాతవార్త: మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఏ.వో శ్రీనివాసులు అధ్యక్షతన స్థానిక సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు, థీమ్ 5 క్లీన్ అండ్ గ్రీన్ విలేజ్ పై ఒక్కరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణా కార్యక్రమంలో వివోఏలకి శిక్షణ అందించడం జరిగింది. మండల పరిషత్ కార్యాలయం ఏ.వో సి. శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ శ్రద్ధగా ఈ ట్రైనింగ్ కార్యక్రమాన్ని వినాలని తద్వారా సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను ఏ విధంగా చేరుకోవాలో ప్రణాళిక వేసుకొని క్లీన్ అండ్ గ్రీన్ విలేజ్‌గా గ్రామాన్ని తీర్చిదిద్దాలని తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా విచ్చేసిన మండల తహశీల్దార్ సయ్యద్ ఇక్బాల్ మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరు తోపాటు వి.వో.ఏ లకి సూచనలు సలహాలు అందజేశారు. శిక్షణ కార్యక్రమానికి ట్రైనర్‌గా పంచాయతీ కార్యదర్శి హుస్సేన్ భాషా వ్యవహరించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో మండల పరిషత్ కార్యాలయం ఏ.వోసి శ్రీనివాసులు మండల తహశీల్దార్ సయ్యద్ ఇక్బాల్ పంచాయతీ కార్యదర్శి హుస్సేన్ భాష, ఏ.పీ.ఎం పోలమ్మ, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

## పరిశోధనలపై ప్రత్యేక దృష్టి సారించాలి : ఏడిఆర్



వెంకటగిరి, నవంబర్ 29 ప్రభాతవార్త: నిమ్మ పంటల సాగులోపరిశోధనలపై ప్రత్యేక దృష్టి సాధించాలని ఏడిఆర్ డాక్టర్ రూత్ తెలిపారు. స్థానిక నిమ్మ పరిశోధన కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. పరిశోధన కేంద్రంలో చేపడుతున్న పరిశోధనలపై ఆమె శాస్త్రవేత్తలు అడిగి తెలుసుకున్నారు. పంటల సాగులో చేపట్టాల్సిన మెలకువలను వివరించారు. ఆమె వెంట తిరుపతి పరిశోధన సంస్థ శాస్త్రవేత్తలు శ్రీనివాసులురెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, సీనియర్ శాస్త్రవేత్త ఎం రామయ్య, కందర్ నాయక్, ఏఈఓలు పాల్గొన్నారు.

## సూళ్లూరుపేట అభివృద్ధికి సహకరించండి : ఎమ్మెల్యే



సూళ్లూరుపేట, నవంబర్ 29 ప్రభాతవార్త: నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులు త్వరితగతిర పూర్తి చేసేందుకు సహకరించాలని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ కోరారు. శనివారం తిరుపతి కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో ఆమె ప్రసంగించారు. నియోజకవర్గానికి సంబంధించి అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలు, వివిధ ప్రభుత్వ శాఖల్లో జరుగుతున్న అభివృద్ధి పనులపై ఆమె సమగ్రంగా చర్చించారు. నియోజకవర్గంలో రోడ్లు, నీటి వనరులు, వ్యవసాయం, సాగునీటి సమస్యలతో పాటు ఆరోగ్యం, విద్య, సంక్షేమ కార్యక్రమాలను, వాటి అమలును అధికారులు బాధ్యతగా భావించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని విజయశ్రీ చెప్పారు. ప్రజల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్, చిత్తూరు ఎంపి దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎంఎల్‌సి బి.కల్యాణ్ చక్రవర్తి, సత్యవేడు ఎమ్మెల్యే కె.ఆదిమూలం, జిల్లా ఎస్పీ సుబ్బారాయుడు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మండల ప్రజలు రైతులు అప్రమత్తంగా ఉండాలి

తడ, నవంబర్ 29 ప్రభాతవార్త: నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడి ఉన్న దిత్వా తుఫాను ప్రభావంతో తిరుపతి జిల్లాలో రాగల రెండు రోజులు భారీ నుండి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండడంతో మండలంలోని లోతట్టు ప్రాంతాల ప్రజలు రైతులు అప్రమత్తంగా ఉండాలని తడ మండల ఎంపీడీవో శేఖర్ నాయక్ ప్రజలకు తెలియజేశారు. మత్స్యకారులు చేపలు వేటకు వెళ్ళవద్దని వేగమైన గాలు వీచేప్రమాదం ఉందని గ్రామాల ప్రజలకు విజన్ యూనిట్ అధికారులు రాత్రి వేళల్లో అందుబాటులో ఉండాలని అధికారులను అప్రమత్తం చేశారు. అత్యవసర సమయాల్లో తప్పలోతట్టు ప్రాంతాల ప్రజలు బయటకు రావద్దని సమస్యలు ఏవైనా ఉంటే మండల స్థాయి కంట్రోల్ రూమ్ 9000661022 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని ఎంపీడీవో శేఖర్ నాయక్ మండల ప్రజలకు తెలియజేశారు.

## నిత్యాన్నదానానికి లక్ష రూపాయలు విరాళం



సూళ్లూరుపేట, నవంబర్ 29 ప్రభాతవార్త: శ్రీచెంగాళమాత పరమేశ్వరిదేవి దేవస్థానంలో నిర్వహిస్తున్న నిత్యాన్న పథకానికి శనివారం ఒక లక్షా ఒక్క రూపాయి విరాళం అందింది. ఈ విరాళాన్ని కడప జిల్లా ఎర్రగుంట్ల గ్రామానికి చెందిన ఎర్రమాల చంద్రశేఖర్‌రెడ్డి దేవస్థానం సహాయ కమిషనర్ బి.ప్రసన్నలక్ష్మికి నగదు రూపంలో అందజేశారు.

## తుపాను కంట్రోల్ రూమ్ ఏర్పాటు

సూళ్లూరుపేట, నవంబర్ 29 ప్రభాతవార్త: బంగాళాఖాతంలో ఏర్పడిన బిత్వా తుపానుకు సంబంధించి సూళ్లూరుపేట మున్సిపల్ కార్యాలయంలో శనివారం కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ కె.చిన్నయ్య తెలిపారు. సూళ్లూరుపేట మున్సిపాలిటీలో అత్యధిక వర్షపాతం నమోదయ్యే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలోని లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. అత్యవసర పరిస్థితుల్లో కంట్రోల్ రూమ్‌లో ఏర్పాటు చేసిన ఫోన్ నంబర్ 08623 295456కు కాల్ చేసి సహాయం పొందాలన్నారు. అలాగే అత్యవసర పరిస్థితుల్లో సహాయక చర్యలు చేపట్టేందుకు ప్రత్యేక సహాయక బృందాలను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా కాచి చల్లార్చిన నీరు తాగాలని కమిషనర్ కె.చిన్నయ్య విజ్ఞప్తి చేశారు.

## రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి గాయాలు

నాయుడుపేట రూరల్, నవంబర్ 29 ప్రభాతవార్త : మండలంలోని అయ్యప్పరెడ్డిపాలెం గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం జరిగింది. ముందు వెళుతున్న లారీని వెనుక నుంచి కారు ఢీకొన్న ఈ ప్రమాదంలో ఐదుగురికి గాయాలయ్యాయి. గుంటూరు నుంచి శబరిమలై యాత్రకు వెళ్లిన పలువురు భక్తులు కారులో తిరుగు ప్రయాణమయ్యారు. ఈ నేపథ్యంలో అయ్యప్పరెడ్డిపాలెం వద్ద జాతీయ రహదారిపై ముందు వెళుతున్న లారీని కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో కారులో గుంటూరు ప్రాంతానికి చెందిన బత్తుల శ్రీనివాసరావు, పద్మావతి, సిహెచ్ భరత్, జి.మణికంఠ, బి.సురేష్‌లకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను నాయుడుపేట ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్సలు అందించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## నాయుడుపేటలో మోస్తరు వర్షం

నాయుడుపేట రూరల్, నవంబర్ 29 ప్రభాతవార్త : పట్టణంతో పాటు మండల పరిధిలో శనివారం దిత్వా తుపాను ప్రభావంతో మోస్తరు వర్షం కురిసింది. ఈ వర్షం కారణంగా రహదారులు చిత్తడిగా మారాయి. దీంతో వాహనదారులు, పాదచారులు అవస్థలుపడ్డారు. ఆకాశం మేఘావృతమై చలిగాలులు వీస్తుండటంతో ప్రజలు బయటకు రాలేని పరిస్థితి నెలకొంది.

## సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు : చైర్ పర్సన్



వెంకటగిరి, నవంబర్ 29 ప్రభాతవార్త: కౌన్సిలర్లు చెప్పిన సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని చైర్‌పర్సన్ నక్క భానుప్రియ తెలిపారు. వెంకటగిరి మున్సిపల్ కౌన్సిల్ సమావేశం పులపాలక సంఘ కార్యాలయంలో చైర్పర్సన్ నక్క భానుప్రియ అధ్యక్షతన జరిగింది. గతంలో వచ్చిన తుఫాన్ వల్ల చేనేత కార్మికుల నష్టపోయారని వారికి ప్రభుత్వం సహాయం అందజేయాలని నాలుగో వార్డ్ కౌన్సిలర్ ఎంఎ నారాయణ తెలిపారు. మరలా తుఫాను కూడా వస్తోందని ఇప్పుడు కూడా చేనేత కార్మికులు ఇబ్బంది పడతారు అని తెలిపారు. తుఫాన్ వల్ల నష్టపోయిన చేనేత కార్మికులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని కోరారు. ప్రభుత్వం మెడికల్ కళాశాలలను ప్రైవేటుపరం చేయరాదని ఆయన తెలిపారు. ప్లేకార్డుతో కౌన్సిల్ సమావేశంలో నిరసన తెలిపారు. 14 వ వార్డులో అనేక సమస్యలు ఉన్నాయని పరిష్కరించడం లేదని కౌన్సిలర్ శంకరయ్య చెప్పారు. ప్రతి మున్సిపల్ సమావేశంలో తన సమస్యలు చెబుతూనే ఉన్నానని కానీ పరిష్కారం కాలేదన్నారు. మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో పలు సమస్యలను కౌన్సిలర్లు. 9వ వార్డులో సమస్యలు పరిష్కరించాలని కౌన్సిలర్ కళ్యాణి చైర్పర్సన్ నక్క భానుప్రియ వినస పత్రం అందజేశారు. ఈ సమావేశంలో వైస్ చైర్మన్లు బాలయ్య, ఉమామహేశ్వరి, సిడిపిఓ శంషాబాద్, సబ్ రిజిస్టర్ భాష, కౌన్సిలర్లు శేఖర్, విజయలక్ష్మి, వహీదా, మల్లీశ్వరి, చంద్రశేఖర్ రెడ్డి, ధనియాల రాదా పూజ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## నవోదయ విద్యాలయం ఏర్పాటు సన్నాహాలు : ఎంపీ



వెంకటగిరి, నవంబర్ 29 ప్రభాతవార్త : జవహర్ నవోదయ విద్యాలయం మంజూరైనట్లు ఎంపీ డాక్టర్ మద్దెల గురుమూర్తి తెలిపారు. జవహర్ నవోదయ విద్యాలయం అవసరమని ఉందని గుర్తించిన ఈ విషయాన్ని తెలియజేస్తూ ఇటీవల జవహర్ నవోదయ విద్యాలయ సమితికి లేఖ రాశారు. తిరుపతిలో ఐఐటీ, ఐజర్ వంటి జాతీయ స్థాయి విద్యాసంస్థలు ఉన్నప్పటికీ, గ్రామీణ విద్యార్థులకు స్కూల్ స్థాయిలో నాణ్యమైన విద్యా అవకాశాలు తక్కువగా ఉన్నాయని ఎంపీ ఆ లేఖలో పేర్కొన్నారు. గ్రామీణ, పేదరికంలో ఉన్న విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంలో నవోదయ విద్యాలయాలు ఎంతో కీలకమని అధికారులకి వివరించారు. ఎంపీ చేసిన విజ్ఞప్తికి స్పందించిన నవోదయ విద్యాలయ సమితి, ప్రతి జిల్లాలో ఒక నవోదయ విద్యాలయం ఉండాలనే పథకం ఉన్నప్పటికీ కొత్తగా ఏర్పడిన తిరుపతి జిల్లాలో ఇంకా ఈ పాఠశాల లేని విషయం గుర్తించింది. త్వరలోనే నవోదయ విద్యాలయం తిరుపతి జిల్లాలో జవహర్ నవోదయ ఏర్పాటు అవుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు.

## తుఫాను సహాయక చర్యలు అందించాలి:ఎమ్మెల్యే



వెంకటగిరి, నవంబర్ 29 ప్రభాతవార్త: దిత్వా తుఫాన్ హెచ్చరిక నేపథ్యంలో వెంకటగిరి నియోజకవర్గ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. నియోజకవర్గంలోని మండల, క్లస్టర్ యూనిట్, బూత్, వార్డ్, గ్రామ అధ్యక్ష ప్రధాన కార్యదర్శి, కమిటీలు, ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించాలని కోరారు. దిత్వా తుఫాన్ ప్రభావంతో వెంకటగిరి నియోజకవర్గంలో ఈనెల 29, 30 మరియు ఈనెలడిసెంబర్ 1వ తేదీలలో గాలులతో కూడిన భారీ నుండి అతిభారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్న నేపథ్యంలో వెంకటగిరి నియోజకవర్గ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అవసరమైతే తప్ప బయట తిరగరాదని చెప్పారు.

## పశు సంతతి ద్వారా రైతులకు అధిక లాభాలు



వెంకటగిరి, నవంబర్ 29 ప్రభాతవార్త : పశు సంతతి ద్వారా రైతులు అధిక లాభాలు పొందవచ్చని డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యానవన యూనివర్శిటీ విస్తరణ సంచాలకులు డాక్టర్ బిజి రాజులు తెలిపారు. కృషి విజ్ఞాన కేంద్రం, పెరియవరం ద్వారా రైతులతో శాస్త్రవేత్తలు చేపడుతున్న వివిధ సాంకేతిక కార్యక్రమాలను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ, ఉద్యాన, పశుపోషణ మరియు గృహవిజ్ఞానానికి సంబంధించిన సాంకేతిక కార్యక్రమాలపై శాస్త్రవేత్తలకు రైతుల ఆదాయాన్ని రెట్టింపు అయ్యే విధంగా పని చేయాలని సూచించారు. అనంతరం కృషి విజ్ఞాన కేంద్రంలో ఉన్నటువంటి ప్రదర్శన క్షేత్రాలను సందర్శించి తగిన సూచనలు సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం అధిపతి డా.డి.శ్రీధర్, శాస్త్రవేత్తలు డా.తిరుపాల్, డా. విజయశ్రీ, డా. పి.నాగార్జునరెడ్డి, డా.ఐ.రాజీవన, రైతులు పాల్గొన్నారు.

## 50 మంది పేద మహిళలకు రగ్గుల పంపిణి



వాకాడు, నవంబర్ 29 ప్రభాతవార్త: వాకాడు, కోట మండల కేంద్రంగా నడపబడుతున్న శ్రీ షిరిడీ సాయి అక్షయ సేవా సమితి ఆధ్వర్యంలో ప్రవాస భారతీయులు అల్లం సాయిరాం నరేష్, సాయి వాణి, వేదాంష్, శ్రేయాన్ష్‌ల ఆర్థిక సౌజన్యంతో వాకాడు మండలం బాలిరెడ్డిపాళెం గ్రామంలోని శ్రీ పట్టాభిరామాలయంలో శనివారం 50 మంది నిరుపేద మహిళలకు 20వేల రూపాయలు విలువచేసే రగ్గులను ఆలయ ధర్మకర్త,మాజీ సొసైటీ చైర్మన్ కొడవలూరు దామోదర్ రెడ్డి, శ్రీ షిరిడీ సాయి అక్షయ సేవా సమితి చైర్మన్ అల్లం రమణయ్య చేతుల మీదుగా పంపిణీ చేశారు. విశ్రాంత ఉపాధ్యాయులు ఆవుల సుబ్బయ్య మాట్లాడుతూ విదేశాలలో ఉంటున్నప్పటికీ స్వదేశంపై మమకారంతో పేదల పట్ల ఆర్తితో ఇటువంటి సత్కార్యం చేయడం ద్వారా జన్మను సార్థకం చేసుకోవడం చాలా సంతోషకరమని అన్నారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు దీవి అనంతబాబు, శ్రీ షిరిడీ సాయి అక్షయ సేవా సమితి సభ్యులు పన్నగ సాయి, వెంపలూరు బాబురావు తదితరులు పాల్గొన్నారు.

## టాస్క్‌ఫోర్స్ అదనపు ఎస్పీకి శుభాకాంక్షలు



తిరుపతి,నవంబర్ 29ప్రభాతవార్త: ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధక టాస్క్‌ఫోర్స్ విభాగం అదనపు ఎస్పీ కులశేఖర్‌కు శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. శనివారం టాస్క్‌ఫోర్స్ కార్యాలయంలో టిడిపి నేత సింగంశెట్టి సుబ్బరామయ్య, బిజెపినేత గుండాల గోపీనాథరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి దుశ్శాలువతో సన్మానించారు.

## టిటిడితో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అవగాహన ఒప్పందం



తిరుమల, నవంబర్ 29 ప్రభాతవార్త: భారతదేశంలో బ్యాంకింగ్ రంగంలో అతిపెద్ద బ్యాంక్ అయిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధికారులు తిరుపతి తిరుపతి దేవస్థానంతో అవగాహన ఒప్పందం చేసుకున్నారు. శనివారం జరిగిన ఈ ఒప్పందం ద్వారా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టిటిడి ఉద్యోగులకు కోటి రూపాయల వరకు ఉచిత ప్రమాద బీమా కవరేజ్ మరియు యాభైలక్షల హెల్త్ ఇన్సూరెన్స్ టాప్-అప్ మరియు ఇతర ప్రయోజనాలు అందిస్తోందన్నారు. ఈ సందర్భంగా టిటిడి ఇఓ సింఘాల్‌కు ఎస్‌బిఐ డిజీఎం దినేష్ గులాటీ, రీజినల్ మేనేజన్ ఎస్.వెంకటేశ్వరరావు అవగాహన ఒప్పంద కాపీని అందించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎసిఎఓ బాలాజీ, డిప్యూటీ వెల్ఫేర్ ఆనందరాజు పాల్గొన్నారు.

## రాజీవ్‌నగర్‌లో అక్రమంగా చెట్లు నరికివేత!

### విద్యుత్ శాఖ చెప్పారంటూ బుకాయింపు-మాకు సంబంధం లేదంటున్న విద్యుత్ శాఖ



తొట్టంబేడు,నవంబర్ 29 ప్రభాతవార్త: శ్రీకాళహస్తికి సమీపంలోని రాజీవ్ నగర్‌లో నిత్యం కలప దొంగలు పడుతున్నారు. పచ్చని చెట్టు కనబడితే చాలు నరికేస్తున్నారు. తుండ్లు తుండ్లుగా చేసి రవాణా చేసి పబ్బం గడుపుకుంటున్నారు. ప్రశ్నిస్తే విద్యుత్‌శాఖ అధికారులు చెప్పారంటూ బుకాయిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. విద్యుత్‌శాఖ అధికారులను ప్రశ్నిస్తే తామెందుకు చెబుతాము? విద్యుత్ లైన్స్‌కు అడ్డంగా ఉన్న చెట్టు కొమ్మలను తొలగిస్తాం తప్ప వృక్షాలను ఎందుకు కొడతామని అయినా కొట్టిన చెట్లను తామెందుకు తరలిస్తామంటూ ఎదురు ప్రశ్నలేస్తున్నారు. వివరాలు పరిశీలిస్తే పచ్చదనం పర్యావరణానికి నిదర్శనం అంటున్నారు.అయితే కైలాసగిరుల్లోని రాజీవ్‌నగర్ కాలనీలో చెట్టుబాగా ఎదిగాయి. వీధి వీధిలో కొందరు ఇళ్ళలో చెట్టు పెంచుకుంటే విశాలమైన వీధుల్లో ప్రకృతి ప్రసాదించిన వరంగా వృక్షాలు పెరిగాయి. వేసవి కాలం ఈ చెట్లు నీడనిస్తున్నాయి. అయితే వీటి మీద కలప దొంగల కన్ను పడింది.వరుస బెట్టి వీధుల్లో 'నీడ నిచ్చే పచ్చని చెట్లను'నిర్ధాక్షిణ్యంగా నరికివేయటం మొదలెట్టారు. తుండ్లుగా మార్చిన చెట్లను తరువాత ట్రాక్టర్లలో తరలించటం మొదలెట్టారు. ఈ కలప దొంగలు ఎప్పుడంటే అప్పుడు నరకటం మొదలెట్టటంతో కాలనీ వాసులకు సందేహమొచ్చింది. వెంటనే విద్యుత్ శాఖ అధికారులను వాకబు చేసారు.ఆ శాఖ లైన్‌మెన్,ఎఇలు మాకేం సంబంధం లేదని సమాధానం చెప్పినట్లు చెబుతున్నారు. దాంతో పర్యావరణాన్ని పరిరక్షిస్తూ వేసవి కాలంలో చల్లని నీడతోపాటు స్వచ్ఛమైన గాలిని అందించే చెట్లను నరికే ముఠా భరతం పట్టాలని భావిస్తున్నారు.

## 'దేవగుడి' చిత్రం ట్రైలర్ లాంచ్‌లో విద్యార్థుల సందడి



తిరుపతిరూరల్, నవంబర్ 29 ప్రభాతవార్త: దేవగుడి చిత్ర ట్రైలర్ లాంచ్ శనివారం గొల్లపల్లిలోని సిద్దార్థ ఇంజనీరింగ్ కళాశాలలో ఘనంగా విడుదల చేసారు. చిత్ర యూనిట్‌తో కలిసి విద్యార్థుల సందడి చేసారు. డిసెంబర్ 19న ప్రేక్షకుల ముందుకు రానున్న చిత్రంపై ఇప్పటికే మంచి అంచనాలు నెలకున్నాయి. ట్రైలర్ లాంచ్‌లో హీరో అభినవ్ శౌర్య, హీరోయిన్ అనుశ్రీ, దర్శక-నిర్మాత బెల్లం రామకృష్ణారెడ్డి, గాయని చిత్ర తదితరులు పాల్గొన్నారు. హీరో కావాలని 12 సంవత్సరాలుగా శ్రమించానని, ప్రేక్షకుల ఆశీర్వాదం కావాలని హీరో అభినవ్ శౌర్య భావోద్వేగంగా కోరారు. ఇంజనీరింగ్ విద్యార్థుల కేరింతలు మధ్య హీరోయిన్ అనుశ్రీ చిత్రంలోని కొన్ని డైలాగులు చెప్పి ఆకట్టుకున్నారు. గాయని చిత్ర పాడిన పాటను కూడా వేడుకలో విడుదల చేసారు. ఈ కార్యక్రమంలో సిద్దార్థ విద్యా సంస్థల అధినేత ఆనందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గణనాధుని దర్శించుకున్న కర్నాటక హైకోర్టు న్యాయమూర్తి



కాణిపాకం, నవంబర్ 29 ప్రభాతవార్త: కర్నాటక రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎం.ఉమేష్ శనివారం కుటుంబసమేతంగా కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన వారికి ఆలయ ఏఈఓలు రవీంద్రబాబు, ప్రోటోకాల్ ఏఈఓ ధనపాల్, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు.అలాగే వారు శ్రీవీరాంజనేయస్వామి ఆలయం, నవగ్రహ ఆలయంలలో కూడా పూజలు నిర్వహించారు.ఈకార్యక్రమంలో ఆలయ సూపరెండెంట్ కోదండపాణి, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ బాలాజినాయుడు, చిత్తూరు కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ ఆకస్మిక తనిఖీలు

తవణంపల్లె, నవంబర్ 29 ప్రభాతవార్త: మండలంలోని తెల్లగుండ్లపల్లె గ్రామంలో ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ శివశంకర్ శనివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.ఈసందర్భంగా గ్రామంలో వివిధ కేటగిరీలకు సంభందించి ఎన్ని సర్వీసులు వున్నాయని పరిశీలించారు. అలాగే ట్రాన్స్‌కో సిబ్బంది సక్రమంగా వినియోగదారులకు సేవలను సకాలంలో అందిస్తున్నారా? లేదా? అని గ్రామస్థులను అడిగి తెలుసుకున్నారు.గ్రామంలో ఇంటింటికి తిరిగి ట్రాన్స్‌కో సేవల గురించి అడిగి తెలుసుకుంటూ విద్యుత్ సరఫరా విషయమై ఏమైనా సమస్యలు వున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అలాగే ఐరాల క్రాస్‌లోని ఏడీఈ కార్యాలయంలో వినియోగదారులకు కారు చార్జింగ్ పాయింట్ ఏర్పాటుకు ప్రతిపాదనలను సిద్ధం చేసి పంపాలని ట్రాన్స్‌కో అధికారులకు సూచించారు. ఈకార్యక్రమంలో ఏపీఎస్పీడీసీఎల్ డైరక్టర్‌లు అయూబ్‌ఖాన్, గురవయ్య,ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్, డీఈ మునిచంద్ర, పైపల్లె ఏడీఈ అరుల్‌లతో పాటు ట్రాన్స్‌కో సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

## భక్తిభావం చాటుతున్న నగరసంకీర్తన



తిరుపతి,నవంబర్ 29ప్రభాతవార్త: తిరుపతి నగరంలో ప్రతి శనివారం వేకువజామున నిర్వహిస్తున్న నగరసంకీర్తన నగరవాసుల్లో, యాత్రికుల్లో భక్తిభావం చాటుతోంది. ప్రతి శనివారం ఉదయం నగరం భజనలు, గోవింద నామస్మరణలతో మర్మోగుతోంది. శనివారం వేకువ జామున రాయలసీమ రంగస్థలి కళాకారులు చేపట్టిన నగరసంకీర్తన గోవిందరాజ స్వామి ఆలయ మాఢవీధులు, పురవీధుల్లో భక్తిని చాటిచెప్పింది. రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథరెడ్డి, కళాకారులు తొండడమనాటి సుబ్రమణ్యంరెడ్డి, కొండె చెంగారెడ్డి, వాసుదేవరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, మునినాథరెడ్డి, భాస్కరాచారి, మునిరత్నమాచారి, మధు, బ్రహ్మానందం,పద్మావతి, సిద్దమ్మ, జయమ్మ, అరుణ, పార్వతి, రెడ్డిబాబు, కల్పన, ధనలక్ష్మి, తదితరులు తిరునామం ధరించి భజనలు చేసుకుంటూ భక్తితో పురవీధుల్లో కదిలారు. భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

## సిబ్బందికి అండగా మేముంటాం

ఐరాల, నవంబర్ 29 ప్రభాతవార్త: సిబ్బందికి ఎలాంటి సమస్యలు ఎదురైనా మీపక్షాన నిలబడి పోరాడేందుకు యూనియన్ నాయకులుగా తాము సిబ్బంగా వున్నామని ఏపీఎన్‌జీఓ అసోసియేషన్, ప్రజారోగ్య ఉద్యోగుల సంఘం నాయకులు సిబ్బందికి భరోసా ఇచ్చారు. ఐరాల పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రెడ్డెప్ప మండలంలోని పనిచేసే వైద్యసిబ్బంది పట్ల అనుచిత వైఖరి, వేధింపులపై డీఎంఅండ్‌హెచ్‌ఓకు ఫిర్యాదు అందిన విషయం విధితమే.ఈనేపథ్యంలో ఏపీఎన్‌జీఓ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వి.శివయ్య, ఏపీ పబ్లిక్ అండ్ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ,జోనల్ కార్యదర్శి శ్రీనివాసమూర్తి, ఏపీఎన్జీవోస్ సంయుక్త కార్యదర్శి వమేష్ కుమార్, చిత్తూరు తాలూకా అధ్యక్షులు సురేంద్రనాథరెడ్డి, మోహన్ తదితరులు శనివారం ఐరాల పీహెచ్‌సికి చేరుకుని పీహెచ్‌సీ వైద్యాధికారి వేధింపులపై విచారణ జరిపారు. ఈసందర్భంగా వైద్యాధికారి మండల వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లును పలు రకాలుగా వేధిస్తున్నారని, తమను వాడలేని పదజాలంతో దూషిస్తున్నారని, ప్రతి చిన్న విషయానికి డబ్బులు డిమాండు చేస్తున్నారని పలువురు సిబ్బంది యూనియన్ నాయకులు ఫిర్యాదు చేశారు.

## రూ. 2 కోట్లు వెనక్కి పంపడం సమంజసం కాదు

- ఫ్లోర్ లీడర్ జీవరత్నం నాయుడు



పుత్తూరు, నవంబరు 29 ప్రభాతవార్త : అభివృద్ధి పనులకు సంబంధించి పుత్తూరు మునిసిపాలిటీలోని వైసిపి పాలకవర్గం తాము చెప్పిన పనులే చేయాలనే పంతంతో రూ. 2కోట్ల రూపాయలు వెనక్కి మళ్లేలా చేయడం సమంజసం కాదని తెలుగుదేశం పార్టీకి చెందిన 22వ వార్డు కౌన్సిలర్, మునిసిపల్ ఫ్లోర్ లీడర్ గాలి జీవరత్నంనాయుడు అన్నారు. శనివారం ఛైర్మన్ ఎ.హరి అధ్యక్షతన జరిగిన కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్ మునిసిపాలిటీ అభివృద్ధి కోసం బిపిఎస్, ఎల్ఆర్ఎస్ పథకాల నుంచి తుడా నుంచి రూ.2కోట్లు మంజూరు చేయించారని తెలిపారు. ఈ నిధులతో పలు అభివృద్ధి పనులను తాము ఎజెండాలో ప్రతిపాదిస్తే మునిసిపాలిటీలో అధికారంలో వున్న వైసిపి పాలకవర్గం వాటిని ఆమోదించ కుండా అభివృద్ధికి అడ్డుపడుతోందని ఆరోపించారు. గతంలో టిడిపి ప్రభుత్వం అధికారంలో వున్నపుడు 2014-19లో 1060 టిడ్కో ఇళ్లు మంజూరు చేయగా అందులో 423 ఇళ్ల నిర్మాణం పూర్తయిందన్నారు. త్వరలోనే మిగిలిన వాటిని పూర్తి చేసి లబ్దిదారులకు అందిస్తామన్నారు.మునిసిపాలిటీలో అధికమైన కుక్కల బెడదను పరిష్కరించాలని అధికారులను కోరారు. పారిశుధ్య సిబ్బంది తక్కువగా వున్నందున మొత్తం 27 వార్డుల్లో అవసరమైనంత అదనపు పారిశుధ్య సిబ్బంది సంఖ్యను పెంచేందుకు పాలకవర్గం ఆమోదం తెలిపింది. మునిసిపల్ ఛైర్మన్ హరి, వైస్‌ఛైర్మన్ డి.జయప్రకాశ్ (చిట్టి) మాట్లాడుతూ తాము అభివృద్ధికి వ్యతిరేకం కాదని, అవసరమైన చోట కాకుండా తమకు అనుకూలంగా టిడిపి కౌన్సిలర్లు అభివృద్ధి పనులు ప్రతిపాదించడం వల్ల వాటిని తాము ఆమోదించలేదని స్పష్టం చేశారు. రూ.2కోట్లతో అన్ని వార్డుల్లోనూ రాజకీయాలకు అతీతంగా అవసరమైన చోట్ల అభివృద్ధి పనులను ప్రతిపాదించి వచ్చే కౌన్సిల్ సమావేశంలో ఆమోదిస్తామని తెలిపారు. సమావేశంలో పలువురు కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

## యస్వీయూ, ఎస్.ఆర్.ఎం.వర్సిటీల మధ్య అవగాహన ఒప్పందం



తిరుపతి విద్య, నవంబర్ 29 ప్రభాతవార్త: ఎస్వియు, ఎస్.ఆర్.ఎం. విశ్వవిద్యాలయం మధ్య శనివారం యస్వీయూ వైస్‌ఛాన్సలర్ ఛాంబర్‌లో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నాయి.ఇది భారతదేశ పరిశోధన ఆవిష్కరణలను బలోపేతం చేసే దిశగా పయనాన్ని సూచిస్తుంది. ఈ సందర్భంగా ఉపకులపతి ఆచార్య టాటా నరసింగరావు ఈ అవగాహన ఒప్పందాన్ని గురించి మాట్లాడుతూ, డీప్‌టెక్ రంగాలలో జాతీయ పురోగతిని వేగవంతం చేసేందుకు, సూపర్ కంప్యూటింగ్, క్వాంటం క్విట్‌లు, క్వాంటం కంప్యూటింగ్, క్వాంటం నావిగేషన్, థిన్‌ఫిల్మ్ టెక్నాలజీలు, డైమండ్ థిన్‌ఫిల్మ్ పరిశోధన, సముద్రపు నీటి విద్యుద్విశ్లేషణ, గ్రీన్ హైడ్రోజన్,హైడ్రోజన్ నిల్వ,హైడ్రోజన్‌శక్తితో కూడిన డేటా సెంటర్‌లతో సహా క్లీన్‌ఎనర్జీ పరిష్కారాలు వంటి అంశాలపై ఈ అంగీకారం దృష్టి పెడుతుందని తెలిపారు. ప్రపంచ స్థాయిలో పోటీ పడటానికి అధ్యాపకులు సిద్ధంగా ఉండాలని ఆయన కోరారు.అనేక సవాళ్లు ఉన్నప్పటికీ, ఆవిష్కరణ,సహకారం , చురుకైన పరిశోధనల ద్వారా అవకాశాలను సృష్టించడానికి సంస్థలు కలిసి పనిచేయాలని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్.ఆర్.ఎం.వర్సిటి వైస్‌ఛాన్సలర్ ఆచార్య సతీష్ కుమార్ విజయవాడలోని విశ్వవిద్యాలయం బలాలను హైలైట్ చేయగా, ఎస్.ఆర్.ఎం. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (పరిశోధన) ఆచార్య డి. నారాయణరావు మాట్లాడుతూ,భారతదేశ శాస్త్రీయ వృద్ధిని వేగవంతం చేయడంలో అంతర్‌సంస్థాగత సహకారం ప్రాముఖ్యతను చెప్పారు. డీప్‌టెక్ రంగాలలో భారతదేశం యొక్క పురోగతిని వేగవంతం చేయడానికి రెండు విశ్వవిద్యాలయాల భాగస్వామ్యాలు అవసరమని తెలిపారు. యస్వీయూ అండ్ ఎస్.ఆర్.ఎం. వర్సిటీ రెండింటి నుండి అధ్యాపకులు వారి పరిశోధన శక్తిని పరస్పరం తెలుసుకున్నారు.ఈ అవగాహన ఒప్పందం ఉమ్మడి పరిశోధన ప్రతిపాదనలు,అధ్యాపకుల మార్పిడి, ఉమ్మడి పేటెంట్లు,అధునాతన పరిశోధన ప్రయోగశాలలు,విద్యార్థుల ఇంటర్న్‌షిప్‌లు, ఆవిష్కరణఆధారిత విద్యా కార్యక్రమాలకు మార్గాన్ని తెరుస్తుంది.ఈ కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య అప్పారావు, రిజిస్ట్రార్ ఆచార్య ఎం. భూపతి నాయుడు, ప్రిన్సిపాల్స్,ఆచార్యులు వి.పద్మావతి,జి. శ్రీనివాసులు,డీన్లు జి.నరసింహ,ఎం.బాలాజీ, కిశోర్, పి.సి.వెంకటేశ్వర్లు,ఆచార్యులు ఓ.ఎం.డి.హుస్సేన్,కె.టి. రామకృష్ణారెడ్డి, విశ్వవిద్యాలయం ఫిజిక్స్, కెమిస్ట్రీ, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాల నుండి ఫ్యాకల్టీ మాజీ ప్రిన్సిపాల్, సీనియర్ ఆచార్యులు కూడా పాల్గొన్నారు.